విశాఖపట్టణం
మంగళవారం 8 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

# జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 207 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## దసరాకి రాజకీయ పార్టీ ప్రకటిస్తా



నేను సీఎంగా ఉండను

కమ్మ, రెడ్డి కాకుంటే ఇతరులకు ఛాన్సిస్తా

బాలథాకరే దరహాలో మెంటర్‌గా ఉంటా

వైసీపీ రప్పా రప్పా పార్టీ

టీడీపీ రెడ్ బుక్ పార్టీ

బొత్స ఎన్ని పార్టీలు మారారో అందరికీ తెలుసు

మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి స్పష్టీకరణ

2

# రచ్చకి ఎక్కవద్దు!

అంతర్గత వివాదాలు, గిల్లికజ్జాలు సరి చేసుకోవాలి

ఇప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏ కూటమిదే గెలుపు

అన్ని సర్వేలు మనకే అనుకూలంగానే ఉన్నాయి

స్థానికంలోనూ సత్తా చాటాల్సిందే

సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

లీడర్షిప్ కాంక్లేవ్‌లో శ్రేణులకు పిలుపు






(అమరావతి - జయజయహే)

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు ఎన్నికలు జరిగినా మళ్లీ ఎన్డీయే కూటమిదే ఘనవిజయమని సీఎం నారా చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. అన్ని తాజా సర్వేలు కూటమికే అనుకూలంగా ఉన్నాయంటూ తెలుగుదేశం పార్టీ నాయకుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపారు. అమరావతి వేదికగా నిర్వహించిన టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో పాల్గొన్న ఆయన, పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలకు భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేశారు. పాలనలోనూ, రాజకీయాల్లోనూ కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య యునిటీ ముఖ్యమని, అంతర్గత వివాదాలు, చిన్న చిన్న గిల్లికజ్జాలతో రచ్చకెక్కవద్దని నేతలకు సూచించారు. రాజకీయ నాయకులు ఎప్పటికప్పుడు భవిష్యత్ పరిస్థితులను అర్థం చేసుకుంటూ ముందుకెళ్లాలని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు వాటిని సరిగ్గా అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. త్వరలోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పూర్తిస్థాయి నివేదికను తయారుచేస్తామన్నారు. విశాఖపట్నం రీజియన్‌కు పెద్ద ఎత్తున పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని, ఇవి రాష్ట్ర భవిష్యత్తుకు ఎంతో కీలకమని పేర్కొన్నారు. అలాగే ఏపీలో నీటి సమస్య శాశ్వతంగా ..మిగతా 2లో



## టీ. అసెంబ్లీ వద్ద రగడ

నినాదాల టీ షర్ట్‌లతో బీఆర్ ఎస్ ఎమ్మెల్యేలు

లోపలికి అనుమతించకుండా అడ్డుకున్న పోలీసులు

టీషర్ట్‌లు విప్పి బనియన్లతో రోడ్డుపై నిరసన

అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రభుత్వ తీరుపై కోర్టుకెక్కిన బీఆర్ఎస్

పోలీసుల తీరుపై న్యాయస్థానం ఆగ్రహం

(హైదరాబాద్ - జయజయహే)

తెలంగాణ శాసనసభ వద్ద అనూహ్య రీతిలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నినాదాలు రాసి ఉన్న నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీ ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు యత్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు గేటు వద్దే అడ్డుకున్నారు. నిరసనకు అనుమతి లేదని పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు టీషర్టులు విప్పి బనియన్లతోనే అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరగడంతో పోలీసులు హరీశ్‌రావు మరియు ..మిగతా 2లో

## ఇకపై అసభ్య వ్యాఖ్యలు చేస్తే సహించం

రాజకీయాల కోసం మహిళలపై నిందలా..!?

మహిళల గౌరవమే ప్రభుత్వానికి ప్రధానం

త్రిషను ఉద్దేశించి ఉదయ్ నిధి వ్యాఖ్యలకు సీఎం విజయ్ కౌంటర్

తమిళనాట అసెంబ్లీలో ఆసక్తికర చర్చ



(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలపై ఎలాంటి నిందాపూర్వక, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని సహించేది లేదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. ఇటీవల నటి త్రిషను ఉద్దేశించి ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే వివాదం చెలరేగిన నేపథ్యంలో, విజయ్ శాసనసభలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో కఠినమైన విమర్శలు ..మిగతా 2లో

## అమ్మో.. నిమ్మ..!

చుక్కలు చూపిస్తున్న ధరలు

కిలో రూ. 220 నుంచి 250కి

డెలివరీ ప్లాట్ ఫామ్‌లలో బాదుడు

కిలో రూ. 320 నుంచి 340కి పెంపు



(విజయవాడ - జయజయహే)

నిమ్మకాయల ధరలు ఒక్కసారిగా విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. మిగతా కూరగాయల ధరలు ఒకింత స్థిరంగా ఉన్నప్పటికీ, చిల్లర మార్కెట్లలో నిమ్మకాయల ధరలు కిలో రూ. 220 నుండి రూ. 250 వరకు పలుకుతున్నాయి. చివరికి చికెన్ ధరతో నిమ్మకాయల ధర పోటీ పడటం గమనార్హం. మరింత విస్తుపోయే విషయమేమిటంటే, ఆన్‌లైన్ క్విక్ కామర్స్, డెలివరీ ప్లాట్‌ఫామ్‌లలో నిమ్మకాయల ..మిగతా 2లో



## ఉప ఎన్నికలకు నగారా..!

ఐదు అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానానికి ఎన్నికలు

అక్టోబర్ 6న పోలింగ్, 9న కౌంటింగ్

ఉత్కంఠభరితంగా నందిగ్రామ్

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

దేశవ్యాప్తంగా ఖాళీ అయిన ఐదు అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన ఈ ఆరు స్థానాల్లో అక్టోబర్ 6న పోలింగ్ నిర్వహించనున్నారు. అక్టోబర్ 9న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు. ఆయా నియోజకవర్గాల ..మిగతా 2లో

## డిఎస్సీ అక్రమాలు అవాస్తవం

శాప్‌పై తప్పుడు ప్రచారం సరికాదు

నియమ, నిబంధనల మేరకే ఉద్యోగాలు

కొన్ని అనుమానాలపై విచారణ చేస్తున్నాం

నివేదిక రాగానే చర్యలు తీసుకుంటాం

పాఠశాల విద్యాశాఖ, శాప్ అధికారుల స్పష్టీకరణ




(అమరావతి - జయజయహే)

మెగా డీఎస్సీ-2025 నియామకాలపై వస్తున్న ఆరోపణలు, వదంతులపై విద్యాశాఖ తీవ్రంగా స్పందించింది. పారదర్శకంగా జరిగిన ఎంపిక ప్రక్రియపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా, శాప్ ఎండీ భరణి స్పష్టం చేశారు. టెట్ అర్హత మార్కులు, క్రీడా కోటా నియామకాలపై వస్తున్న వార్తల్లో వాస్తవాలను వారు వెల్లడించారు. ఉపాధ్యాయులను, ఎంపికైన అభ్యర్థులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టెట్‌లో అర్హత సాధించని వారు ..మిగతా 2లో



## గ్యాస్ బుకింగ్ గడువు తగ్గింపు

45 రోజుల నుంచి 25 రోజులకు కుదింపు

పట్టణ, గ్రామీణ వినియోగదారులకు ఒకే రూల్

ఆంక్షలు పూర్తిగా సడలింపు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గ్యాస్ వినియోగదారులందరికీ సమాన నిబంధనలు వర్తించేలా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాల్లో సిలిండర్ రీఫిల్ బుకింగ్ కోసం ఉన్న ..మిగతా 2లో

# డిఎస్సీ అక్రమాలు అవాస్తవం

మొదటి పేజీ తరువాయి...

తప్పుడు మార్కులతో ఉద్యోగాలు పొందారన్న ఆరోపణలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా తోసిపుచ్చారు. ఎంపికైన అభ్యర్థులు జంపల ఉష (80 మార్కులు), మిర్యాల గాయత్రి సాయి శ్రీ (97 మార్కులు), ప్రగడ కళ్యాణి (75 మార్కులు) నిబంధనల ప్రకారమే టెట్‌లో అర్హత సాధించారని స్పష్టం చేశారు. కర్నూలు జిల్లాకు చెందిన ప్రభాకర్ (77 మార్కులు) పై వచ్చిన ఆరోపణలపై కమిటీ దర్యాప్తు చేస్తోందని, ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

2009 నుంచి 1 నుంచి 8వ తరగతి బోధించే ప్రభుత్వ, ప్రైవేటు టీచర్లు అందరికీ టెట్ తప్పనిసరి అని కమిషనర్ గుర్తుచేశారు. డీఎస్సీ పోస్టుల్లో టెట్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుందని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ సహా అన్ని సర్టిఫికెట్లను రెవెన్యూ శాఖ ద్వారా క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పరిగణనలోకి తీసుకున్నామన్నారు. టీచర్ చక్రపాణి రెడ్డిని ఇద్దరు వ్యక్తులు బెదిరించి, పిల్లల ముందే అవమానించడాన్ని ఆమె తీవ్రంగా పరిగణించారు. ఉపాధ్యాయులను బెదిరించినా, ఫేక్ సర్టిఫికెట్లంటూ తప్పుడు ప్రచారం చేసినా సీరియస్ యాక్షన్ తీసుకుంటామని తేల్చిచెప్పారు. "డీఎస్సీపై వచ్చిన ప్రతి ఆరోపణనూ సీరియస్‌గా తీసుకుంటున్నాం. తప్పుడు మార్కులతో పోస్టు సాధించారని ఆరోపణలు వచ్చాయి. టెట్‌లో అర్హత సాధించలేదన్న ఫిర్యాదులపై విచారణ జరుపుతున్నాం. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయి. టెట్‌లో ఉష, గాయత్రి, కల్యాణి అర్హత సాధించారు. ఒకే కోటాలో వచ్చినవారు ఒకే బడిలో




పనిచేయకూడదనే నిబంధన లేదు. కర్నూలు జిల్లా నుంచి ఎక్కువమంది స్పోర్ట్స్ కోటాలో ఎంపికయ్యారు. రెవెన్యూశాఖ ధ్రువీకరించిన ఈడబ్ల్యూఎస్ ధ్రువపత్రాలనే పరిశీలించాం. చక్రపాణిరెడ్డి అనే టీచర్‌ను కొందరు విలేకరులు అవమానించారు." అని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా వెల్లడించారు.

డీఎస్సీ క్రీడా కోటా నియామకాలపై శాప్ ఎండీ భరణి స్పష్టత ఇచ్చారు. డీవోపీటీ నిబంధనలను అనుసరించే అత్యంత పారదర్శకంగా క్రీడా కోటా భర్తీ జరిగిందన్నారు. జూడో, సాఫ్ట్‌బాల్ సంఘాల మధ్య ఉన్న రాజకీయాలను, వివాదాలను డీఎస్సీకి ఆపాదించడం సరికాదన్నారు. భార్యాభర్తలు ఇద్దరూ మెడల్స్ సాధించి, ప్రతిభ ఆధారంగా ఉద్యోగం సాధిస్తే అందులో తప్పేముందని ప్రశ్నించారు. బాక్సింగ్ క్రీడాకారుడు పెద్ద అప్పలరాజు తన సోదరుడి సర్టిఫికెట్‌తో పోస్టు పొందారని, అభ్యర్థి కొనద పద్మజ వయసుపైనా వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేశారు. స్పోర్ట్స్ మెరిట్ పాయింట్ల ఆధారంగానే ఉద్యోగాలు వచ్చాయని భరణి తెలిపారు. పోస్టులు రాని వారి వద్దకు వెళ్లి కొందరు కావాలనే ఇలాంటి ఆరోపణలు చేయిస్తున్నారని ఆమె మండిపడ్డారు. నిబంధనల ప్రకారం ఎంపికైన వారి వద్దకు వెళ్లి ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశాల్లో న్యాయస్థానం ఆదేశాలనే పాటిస్తామన్నారు. క్రీడాకారులకు ఏవైనా ఫిర్యాదులు ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చని శాప్ ఎండీ సూచించారు. "మెగా డీఎస్సీపై ఇప్పటికే వాస్తవాలు బయటపెట్టాం. అభ్యర్థులను ఇబ్బంది పెడుతూ ఆరోపణలు తీవ్రం చేస్తున్నారు. జూడోపై ఆరోపణలు క్రీడాసంఘాల వివాదాలకు సంబంధించినవే. జూడో అసోసియేషన్ల వివాదాలకు, డీఎస్సీకి సంబంధం లేదు. డీఎస్సీ నిర్వహణలో ఎలాంటి నిబంధనలూ అతిక్రమించలేదు. అసోసియేషన్ వివాదం వల్లే ఇప్పుడు అభ్యంతరం చెబుతున్నారు. కోర్టు పరిధిలో ఉన్నందున దాని ఆదేశాల ప్రకారమే నడుచుకుంటాం. భార్యాభర్తలు పతకాలు గెలిచి, డీఎస్సీలో అర్హత సాధిస్తే తప్పేంటి?. బాక్సింగ్ ఆటగాడు పెద్ద అప్పలరాజుపై వచ్చినవి నిరాధార ఆరోపణలే. మరో అభ్యర్థి కొనద పద్మజపై వచ్చిన ఆరోపణలు అర్థం లేనివి." అని శాప్ ఎండీ భరణి వెల్లడించారు.



# టీ. అసెంబ్లీ వద్ద రగడ

మొదటి పేజీ తరువాయి...

గులాబీ నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఆందోళన సమయంలో సభ ప్రవేశ ద్వారం వద్ద తీవ్ర నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పోలీసులు తనపట్ల అత్యంత అమానుషంగా ప్రవర్తించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి మీడియా ముందే కన్నీళ్లు పెట్టుకున్నారు. మరోవైపు పోలీసుల తోపులాట, నిరసనల మధ్య తీవ్ర తీవ్రతకు గురైన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోవడంతో అక్కడ ఉన్నవారంతా ఆందోళనకు గురయ్యారు. ఉద్రిక్తత కాస్తా మరీ ముదరడంతో శాసనసభ పరిసర ప్రాంతాలన్నీ సైరన్ మోతలతో అట్టుడికిపోయాయి. శాసనసభ గేటు వద్ద జరిగిన ఘటనపై ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పావళి స్పందిస్తూ స్పష్టత ఇచ్చారు. కేవలం నల్ల టీషర్టులు వేసుకోవడం నేరం కాదని, అయితే ఆ టీషర్టులపై రాసి ఉన్న పదాలు అభ్యంతరకరంగా ఉండటం వల్లే లోపలికి అనుమతించలేదని తెలిపారు. ఎమ్మెల్యేలతో పోలీసులు అసభ్యంగా ప్రవర్తించలేదని, స్పీకర్ సూచనల మేరకే భద్రతా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతల ఆరోపణల నేపథ్యంలో అసెంబ్లీ వద్ద నమోదైన వీడియో ఫుటేజీని సమగ్రంగా పరిశీలిస్తామని డీసీపీ వెల్లడించారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారన్న ఆరోపణలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. అసెంబ్లీకి వెళ్లే శాసనసభ్యులను పోలీసులు ఎలా నిలువరిస్తారని న్యాయస్థానం ప్రశ్నించింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని రాష్ట్ర డీజీపీని ఆదేశించింది. తమ పార్టీ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. పిటిషన్‌పై విచారణ సందర్భంగా అసెంబ్లీ వ్యవహారాల్లో పోలీసుల జోక్యానికి సంబంధించిన అంశాన్ని న్యాయస్థానం ప్రస్తావించింది. 'అసెంబ్లీ స్పీకర్ పరిధిలో పోలీసులకు ఏంటి పని?' అంటూ సూటిగా ప్రశ్నించింది. అసెంబ్లీ నిబంధనలకు సంబంధించి ఏదైనా ఉల్లంఘన జరిగితే దానిపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది. పోలీసులు స్వయంగా ఎమ్మెల్యేలను అడ్డుకోవడం సరైన విధానం కాదని పేర్కొంది. సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న ప్రజాప్రతినిధులను అడ్డుకోవడంపై వివరాలు ఇవ్వాలని ఆదేశించింది. ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై కూడా హైకోర్టు సీరియస్ అయింది. దాడికి పాల్పడ్డారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులను గుర్తించి, అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని ఆదేశించింది. అసెంబ్లీ వద్ద జరిగిన మొత్తం పరిణామాలపై సమగ్ర నివేదికను రెండు వారాల్లో సమర్పించాలని డీజీపీకి హైకోర్టు గడువు విధించింది. దాంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకున్న ఘటన ఇప్పుడు న్యాయస్థానం పరిశీలనలోకి వెళ్లింది. ఈ వ్యవహారంలో పోలీసుల పాత్ర, మహిళా ఎమ్మెల్యేలపై జరిగినట్లు ఆరోపిస్తున్న దాడి, అసెంబ్లీ పరిధిలో పోలీసుల జోక్యంపై తదుపరి విచారణలో స్పష్టత రానుంది.

# అమ్మో.. నిమ్మ..!

మొదటి పేజీ తరువాయి...

ధరలు ఏకంగా కిలో రూ. 320 నుండి రూ. 340 వరకు చేరాయి. సాధారణ సూపర్ మార్కెట్లలో సైతం అధిక ధరలకే విక్రయిస్తున్నారు. ధరల మంట కారణంగా సామాన్యులు నిమ్మకాయలు కొనాలంటేనే భయపడిపోతున్నారు. గతంలో రూ. 20లకే దొరికే ఆరు నిమ్మకాయలకు ఇప్పుడు ఏకంగా రూ. 40 లేదా 50 వెచ్చించాల్సి వస్తోందంటున్నారు జనాలు. సికింద్రాబాద్ మోండా మార్కెట్ పరిస్థితి చూసుకుంటే.. ఇక్కడ రిటైల్‌లో కిలో రూ. 220 నుండి రూ. 250 మధ్య విక్రయిస్తున్నారు. నెల రోజుల క్రితం కిలో రూ. 140 నుండి రూ. 150 ఉన్న ధరలు, గత 20 రోజులుగా నిరంతరం పెరిగాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో నిమ్మకాయల ధర కిలో రూ. 150 నుండి రూ. 180 వరకు ఉండగా, చిల్లర మార్కెట్‌లో రూ. 200 నుండి రూ. 250 వరకు అమ్ముతున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రావాల్సిన నిమ్మకాయల దిగుమతులు బాగా తగ్గిపోవడమే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్లకు ప్రధానంగా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి సరుకును దిగుమతి చేసుకుంటున్నారు. దూర ప్రాంతాల నుంచి రవాణా చేయడం వల్ల రవాణా ఖర్చులు పెరిగి, ఆ భారం వినియోగదారులపై పడుతోంది. నిమ్మకాయల ధరలు మండిపోతున్నప్పటికీ, మిగిలిన కూరగాయల ధరలు వినియోగదారులకు కొంత ఊరటనిస్తున్నాయి. బోయిన్‌పల్లి హోల్‌సేల్ మార్కెట్ ప్రకారం వివిధ కూరగాయల ధరల వివరాలు చూస్తే.. చిక్కుడుకాయలు కిలో రూ. 100, దొండకాయలు కిలో రూ. 50, బీట్‌రూట్ కిలో రూ. 50, బెండకాయలు కిలో రూ. 40, పచ్చిమిర్చి కిలో రూ. 40, టమాటాలు కిలో రూ. 20, కీరా దోస కిలో రూ. 20 వరకు ఉన్నాయని మార్కెట్‌లో పని చేసే బండి మహేశ్ అనే వ్యక్తి తెలిపారు. గత వారంతో పోలిస్తే కొన్ని కూరగాయల ధరలు స్వల్పంగా పెరిగినప్పటికీ, నిమ్మకాయల రేట్లు మాత్రం ఆకాశాన్ని తాకుతున్నాయి. రాబోయే రోజుల్లో దిగుమతులు పెరిగితే తప్ప నిమ్మకాయల ధరలు అదుపులోకి వచ్చే అవకాశం కనిపించడం లేదు.

# రచ్చకి ఎక్కవద్దు!

మొదటి పేజీ తరువాయి...

పరిష్కరిస్తే దాదాపుగా మెజారిటీ సమస్యలు తీరతాయి కనుక... నేతలంతా ఈ అంశంపై ఫోకస్ చేయాలని దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అన్ని జిల్లాలకు ఇంఛార్జ్‌లను నియమించారు. ఈసారి అభ్యర్థుల ఎంపికను సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కాకుండా ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఇతర కీలక నేతలకు అప్పగించారు. ఎన్నికల ప్రచారం, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను యాక్టివ్ చేయడంతో పాటు కూటమి మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఇంఛార్జ్‌లకు సూచించారు.

**తెలుగుదేశం పార్టీ 28 జిల్లాలకు ప్రకటించిన ఇంఛార్జ్‌ల లిస్ట్**

1. పార్వతీపురం మన్యం: దాడి రత్నాకర్
2. అల్లూరి సీతారామరాజు: పేరాబత్తుల రాజశేఖర్
3. శ్రీకాకుళం: ఎండీ నజీర్
4. విజయనగరం: ఎంపీ చింతకాయల విజయ్
5. విశాఖపట్నం: ఎంఏ షరీఫ్
6. అనకాపల్లి: కొండపల్లి అప్పలనాయుడు
7. పోలవరం: కే సత్తిబాబు
8. కాకినాడ: సుజయ కృష్ణారంగారావు
9. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ: ఎంపీ సానా సతీశ్
10. తూర్పు గోదావరి: దేవినేని ఉమామహేశ్వరరావు
11. పశ్చిమ గోదావరి: ఎంపీ భాష్యం రామకృష్ణ
12. ఏలూరు: ఎమ్మెల్సీ పంచమర్తి అనురాధ
13. కృష్ణా: కొమ్మాలపాటి శ్రీధర్
14. ఎన్టీఆర్: మల్లికార్జునరావు
15. గుంటూరు: ఎంపీ సత్యనారాయణరాజు
16. పల్నాడు: కొనకళ్ల నారాయణ
17. బాపట్ల: జంగా కృష్ణమూర్తి
18. ప్రకాశం: ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి
19. మార్కాపురం: ఎమ్మెల్సీ బీటీ నాయుడు
20. నెల్లూరు: ఎస్వీపీఎస్ఎన్ వర్మ
21. తిరుపతి: నూకసాని బాలాజీ
22. చిత్తూరు: దామచర్ల సత్య
23. కడప: దీపక్ రెడ్డి
24. అన్నమయ్య: ఎమ్మెల్సీ శ్రీకాంత్
25. అనంతపురం: ఏరాసు ప్రతాపరెడ్డి
26. శ్రీసత్యసాయి: సోమిశెట్టి వెంకటేశ్వర్లు
27. కర్నూలు: పెళ్లకూరు శ్రీనివాసరెడ్డి
28. నంద్యాల: వైకుంఠం ప్రభాకర్ చౌదరి

# ఉప ఎన్నికలకు నగారా..!

మొదటి పేజీ తరువాయి...

ప్రజాప్రతినిధులు రాజీనామా చేయడంతో ఈ స్థానాలకు ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 9న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 16 వరకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. సెప్టెంబర్ 17న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. సెప్టెంబర్ 19 వరకు అభ్యర్థిత్వాలను ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. తమిళనాడులో మదురాంతకం, ధారపురం, పుదుచ్చేరిలో తట్టంచావడి, పశ్చిమ బెంగాల్‌లో రెజీనగర్, నందిగ్రామ్ అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. వీటితో పాటు అస్సాంలోని నాగావ్ లోక్‌సభ స్థానానికి కూడా ఎన్నిక నిర్వహించనున్నారు. అస్సాంలో నాగావ్ ఎంపీ ప్రద్యుత్ బోర్డోలోయ్ రాజీనామా చేయడంతో లోక్‌సభ స్థానం ఖాళీ అయింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. దీంతో నాగావ్ స్థానంపై ఉప ఎన్నిక ఆసక్తిని పెంచుతోంది.

**అత్యంత కీలకంగా నందిగ్రామ్..!**

పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్ ఉప ఎన్నిక రాజకీయంగా అత్యంత కీలకంగా మారింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నందిగ్రామ్ నుంచి సువేందు అధికారి పోటీ చేసి అప్పటి ముఖ్యమంత్రి మమతా బెనర్జీని ఓడించారు. అనంతరం ఆయన ఆ స్థానానికి రాజీనామా చేయడంతో ఇప్పుడు ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో మమతా బెనర్జీ మరోసారి నందిగ్రామ్ నుంచి బరిలోకి దిగుతారా అనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. రెజీనగర్‌లోనూ ఎమ్మెల్యే హుమాయున్ కబీర్ రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక జరుగుతోంది. తమిళనాడులో మదురాంతకం, ధారపురం, పుదుచ్చేరిలో తట్టంచావడి స్థానాలు కూడా ప్రజాప్రతినిధుల రాజీనామాలతో ఖాళీ అయ్యాయి. ఇదిలా ఉండగా, ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ పై వివాదం కొనసాగుతున్న సమయంలోనే ఎన్నికల సంఘం ఉప ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# దసరాకి రాజకీయ పార్టీ ప్రకటిస్తా

## మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి స్పష్టీకరణ

(విజయవాడ - జయజయహే)

రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. వైఎస్సార్‌సీపీ మాజీ నాయకుడు విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ స్థాపనపై సంచలన వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే తన నూతన పార్టీ జెండా, అజెండాలను ప్రజల ముందుకు తీసుకువస్తానని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజల క్షేమమే ధ్యేయంగా ఈ కొత్త ప్రత్యామ్నాయ శక్తులు రూపుదిద్దుకుంటున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రధాన పార్టీలైన తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ చుట్టూనే రాజకీయం తిరుగుతోందని విజయసాయిరెడ్డి ఆరోపించారు. ఈ రెండు పార్టీలు ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరతీశాయని విమర్శించారు. ఒక వైపు రెడ్ బుక్ పాలన సాగిస్తున్న టీడీపీ, మరోవైపు రప్పా రప్పా సంస్కృతిని ప్రోత్సహిస్తున్న వైసీపీల మధ్య యుద్ధం జరుగుతోందని దుయ్యబట్టారు. అధికార మార్పిడి కేవలం ఈ రెండు పార్టీల మధ్యే మారుతుందన్న భావన ప్రజల్లో నెలకొందని, దీనివల్ల సామాన్యులు తీవ్రంగా నలిగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడే విషయంలో సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్, బీజేపీ, జనసేన వంటి ఇతర పార్టీలు పూర్తిస్థాయిలో విఫలమయ్యాయని, అందుకే తాను కొత్త వేదికను సిద్ధం చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఏ చిన్న పని జరగాలన్నా లంచాలు ఇచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. వ్యాపారాలు చేసుకోవాలన్నా, ఇల్లు కట్టుకోవాలన్నా, ఇసుక, మట్టి లేదా ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసమైనా ప్రజాప్రతినిధులకు, అధికారులకు, రౌడీలకు మామూళ్లు చెల్లించాల్సి వస్తోందని ఆరోపించారు. గత ఎన్నికల్లో రూ. 20 కోట్లు, రూ. 40 కోట్లు ఖర్చు పెట్టిన నాయకులు, ఆ సొమ్మును రికవర్ చేసుకోవడంతో పాటు రాబోయే ఎన్నికల కోసం కూడబెట్టుకోవడానికే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. కక్షపూరిత రాజకీయాలను ఏపీకి తీసుకువచ్చి, అక్రమ కేసులు, అరెస్టులతో కాలం వెళ్లదీస్తున్నారని, ఏ ఒక్కరూ అభివృద్ధి ప్రాజెక్టుల గురించి మాట్లాడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 6 కోట్ల మంది ప్రజలు కేవలం రెండు కుటుంబాల స్వార్థ రాజకీయాల కోసమే ఉన్నారా అని విజయసాయి రెడ్డి ప్రశ్నించారు. ఏపీలో రెడ్డి, కమ్మ వర్గాలే కాకుండా బీసీలు, కాపులు, వెలమలు, ముస్లింలు, క్రైస్తవులు పెద్ద సంఖ్యలో ఉన్నారని గుర్తుచేశారు. 'సమర్థత, అనుభవం ఉన్నప్పటికీ బీసీలు, కాపులు, వెలమలు ముఖ్యమంత్రులు కాకుండా ఈ రెండు వర్గాలు అణచివేస్తున్నాయి. అందుకే మా పార్టీ ద్వారా అర్హత ఉన్న ఏ కులానికి చెందిన నాయకుడైనా సీఎం అయ్యే అవకాశం కల్పిస్తాం.' అని విజయసాయిరెడ్డి అన్నారు. తన రాజకీయ భవిష్యత్తు, కొత్త పార్టీలో తన పాత్రపై విజయసాయిరెడ్డి స్పష్టత ఇచ్చారు. తాను కొత్త పార్టీ తరపున ముఖ్యమంత్రి అభ్యర్థిగా పోటీ చేయనని వెంకటేశ్వరస్వామి సాక్షిగా వెల్లడించారు. మహారాష్ట్ర రాజకీయాల్లో బాల్ ఠాక్రే వహించిన పాత్ర తరహాలోనే, తాను కూడా పార్టీకి కేవలం ఒక మెంటార్‌గా మాత్రమే వ్యవహరిస్తానని తెలిపారు. దేశభక్తి, పరిపాలనా సామర్థ్యం, తెలివితేటలు కలిగిన నాయకులకు అధికార పగ్గాలు అప్పగించి, వెనుక ఉండి పార్టీని నడిపిస్తానని ప్రకటించారు.

# ఇకపై అసభ్య వ్యాఖ్యలు చేస్తే సహించం

మొదటి పేజీ తరువాయి...

చేసుకోవడం సహజమేనని, అయితే భావ ప్రకటనా స్వేచ్ఛ పేరిట మహిళలను కించపరిచేలా మాట్లాడటం సరికాదని సీఎం పేర్కొన్నారు. తన సినీ కెరీర్‌లోనూ, ప్రస్తుతం రాజకీయంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడంలోనూ మహిళల పాత్ర కీలకమైనదని విజయ్ గుర్తుచేశారు. ఇంట్లో తల్లులు, సోదరీమణులను ఏ విధంగా గౌరవిస్తామో, బయట కూడా అదే గౌరవాన్ని కొనసాగించాలని కోరారు. ఇటీవల కాలంలో తమిళనాడు రాజకీయాల్లో ద్వంద్వార్థాలు (డబుల్ మీనింగ్స్), అశ్లీల పదజాలంతో మాట్లాడే ధోరణి పెరిగిపోయిందని, మహిళలను కించపరిచేలా ఎవరు మాట్లాడినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. చారిత్రక అంశాల ప్రస్తావన: గతంలో ఇదే శాసనసభలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత అవమానానికి గురైన ఉదంతాన్ని ప్రస్తావిస్తూ, అలాంటి సంస్కృతిని ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.

**డీఎంకే, ఉదయనిధి స్టాలిన్ స్పందన**

కావేరీ నిరసన సభలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవ్వగా, ఆయన ఏ నటి పేరును ప్రస్తావించలేదని డీఎంకే వర్గాలు తెలిపాయి. రాజకీయంగా లబ్ధి పొందడానికే తమ వ్యాఖ్యలను ఎడిట్ చేసి, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించాయి. ఈ అంశంపై శాసనసభ సమావేశాల అనంతరం ఉదయనిధి స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి విజయ్ డీఎంకేపై ఎలాంటి ఆధారాలు లేకుండా లేనిపోని ఆరోపణలు చేశారని విమర్శించారు. అసెంబ్లీలో సీఎం ఆరోపణలకు సమాధానం ఇచ్చేందుకు ప్రతిపక్షానికి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఆరోపణలు చేస్తే సరిపోదని, వాటిని నిరూపించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉందన్నారు.

# గ్యాస్ బుకింగ్ గడువు తగ్గింపు

మొదటి పేజీ తరువాయి...

45 రోజుల ఆంక్షలను సడలిస్తూ, దానిని 25 రోజులకు తగ్గించారు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి ఈ విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. ఈ నయా నిబంధనలతో ఇకపై పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా దేశవ్యాప్తంగా ఉన్న గృహ వినియోగదారులందరూ ప్రతి 25 రోజులకు ఒకసారి ఎల్‌పీజీ రీఫిల్ బుక్ చేసుకునే వెసులుబాటు లభించనుంది. అంతర్జాతీయంగా అమెరికా-ఇరాన్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు, హార్ముజ్ జలసంధి గుండా చమురు రవాణా నిలిచిపోవడం వల్ల దేశంలో ఎల్‌పీజీ సరఫరాపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఈ క్రమంలో గ్యాస్ అక్రమ నిల్వలను నిరోధించేందుకు ప్రభుత్వం డిమాండ్ నియంత్రణ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల బుకింగ్ వ్యవధిని అమలులోకి తెచ్చారు. అయితే, ప్రస్తుతం దేశంలో గ్యాస్ నిల్వలు, సరఫరా పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంది. సిలిండర్ల పంపిణీలో ఉన్న పెండింగ్ (బ్యాక్‌లాగ్) కూడా గణనీయంగా తగ్గింది. దీంతో నిబంధనలను సడలిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. "ప్రస్తుతం ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగైంది. రీఫిల్ బ్యాక్‌లాగ్ గణనీయంగా తగ్గడంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఆంక్షలను సడలించింది. ఇకపై గ్రామీణ, పట్టణ వ్యత్యాసం లేకుండా అందరూ ప్రతి 25 రోజులకు ఒకసారి ఎల్‌పీజీ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు" అని కేంద్ర సహాయ మంత్రి సురేష్ గోపి తన సోషల్ మీడియా వేదికగా స్పష్టం చేశారు. ఈ నూతన నిబంధనలను తక్షణమే అమలు చేయాలని పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందూస్థాన్ పెట్రోలియం వంటి చమురు మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసీలకు) స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన అధికారిక ఉత్తర్వుల ప్రతిని కూడా మంత్రి పంచుకున్నారు. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది గ్రామీణ గ్యాస్ వినియోగదారులకు పెద్ద ఉపశమనం లభించింది.

# కూటమి ప్రభుత్వంతో కాపుల దశాబ్దాల కల సాకారం

## కాపు భవన నిర్మాణానికి ఘనంగా భూమిపూజ

**రాజమహేంద్రవరం: జయ జయహే : సెప్టెంబర్ 7:**





కాపు సమాజం ఎన్నో దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న కాపు భవన నిర్మాణానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలోని కలెక్టరేట్ సమీపంలో ప్రభుత్వం కేటాయించిన 30 సెంట్ల స్థలంలో సోమవారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి ఘనంగా భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, కాపుల కళ్యాణ మండపం (కాపు భవనం) నిర్మాణానికి స్థలం కేటాయించాలని దశాబ్దాలుగా జరుగుతున్న ప్రయత్నాలకు కూటమి ప్రభుత్వంతో ఫలితం దక్కిందన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపి పురందేశ్వరి, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఎంతోకాలంగా చేసిన కృషి ఫలించిందని పేర్కొన్నారు. కాపు భవనానికి కేటాయించిన 30 సెంట్ల స్థలం విశ్వవిద్యాలయ భూమి అంటూ కొందరు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని, అందులో ఎలాంటి వాస్తవం లేదని మంత్రి స్పష్టం చేశారు. 2008లోనే 45 ఎకరాల భూమిలో విశ్వవిద్యాలయానికి 20 ఎకరాలు మాత్రమే కేటాయించారని, మిగిలిన 25 ఎకరాల్లో అగ్రికల్చర్ యూనివర్సిటీ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, ప్రస్తుతం కొనసాగుతున్న కలెక్టరేట్, గోదావరి గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో పాటు ఇతర ప్రభుత్వ సంస్థలకు భూములు కేటాయించారని వివరించారు. కాబట్టి కాపు భవనానికి కేటాయించిన స్థలం వర్సిటీ పరిధిలోకి రాదని గణాంకాలతో సహా స్పష్టం చేశారు. సమాజంలో ఎవరికీ ఇబ్బంది కలగకుండా ఈ సత్కార్యాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని, సమాజానికి ఉపయోగపడే శాశ్వత ఆస్తిగా కాపు భవనం నిలుస్తుందనిఅభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా కాత్యవీర్యార్జునుడి ఉదాహరణ ప్రస్తావించిన మంత్రి, సాధారణంగా రెండు చేతులు ఉన్న ఆయన యుద్ధ సమయంలో వెయ్యి చేతులతో పోరాడినట్లు పురాణాలుచెబుతున్నాయని, అలాగే ప్రజల సంక్షేమం కోసం అవసరమైతే తాను కూడా వెయ్యి చేతుల శక్తితో పనిచేయడానికి సిద్ధంగా ఉంటానని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పినట్లుగా పెద్దన్న పాత్ర పోషిస్తూ ఎలాంటి వివక్ష లేకుండా అన్ని కులాలు, వర్గాలను కలుపుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. భవన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి సంపూర్ణంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే ఈ దశాబ్దాల కల సాకారమైందని పేర్కొన్న మంత్రి, ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చడంలో కీలకంగా వ్యవహరించిన ఎంపి దగ్గుబాటి పురందేశ్వరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



## భాదితుల న్యాయమైన సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### విజయనగరం జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్

**విజయనగరం జయజయహే**

ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయపరంగా చట్టపరిదిలో సమస్యలను పరిష్కరించాలని విజయనగరం జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ అధికారులను ఆదేశించారు . సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు . ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత అధికారులకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు . మొత్తం 30 ఫిర్యాదులను స్వీకరించగా భూతగాదాలకు సంబంధించినవి 22, కుటుంబ కలహాలకు సంబంధించినవి 3, మోసాలకు పాల్పడినట్లు 2,ఇతర అంశాలకు సంబంధించినవి 3 ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు. ఫిర్యాదులు పరిశీలించి విచారణ చేయాలని, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లాపోలీసు కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డి.సి.ఆర్.బి. సిఐ కే.కుమార స్వామి, ఎస్బీ సిఐ ఎ.వి.లీలారావు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పెండింగ్ హయ్యర్ పెన్షన్లను విడుదల చేయాలి

### రీజనల్ పీఎఫ్ కమిషనర్కి విజ్ఞప్తి చేసిన స్టీల్ ప్లాంట్ హయ్యర్ పెన్షనర్లు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 7, జయ జయహే**

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు చెందిన హయ్యర్ పెన్షనర్లు గత కొద్ది నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ హయ్యర్ పెన్షన్లను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం మర్రిపాలెంలోని విశాఖపట్నం ప్రాంతీయ భవిష్యనిధి కమిషనర్ కి విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు చెందిన హయ్యర్ పెన్షనర్లతరఫున ఈ వినతిపత్రం సమర్పించామని స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ డిజిఎం ద్వారం స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈపిఎఫ్ఓ ద్వారా తమ డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు ఇప్పటికే ఆమోదం పొందినప్పటికీ, పలువురు విశాఖ ఉక్కు కర్మాగారం హయ్యర్ పెన్షనర్లకు జూన్, జూలై మరియు ఆగస్టు 2026 నెలలకు సంబంధించిన పెన్షన్లు ఇంకా జమ కాలేదని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, పెన్షనర్లకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, సమస్యకు కారణమైన సాంకేతిక లోపాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న పెన్షన్ మొత్తాలను ప్రభావిత పెన్షనర్లందరికీ తక్షణమే జమ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్టీల్ ప్లాంట్ పెన్షనర్లు తరఫున ఆత్మ రామ శర్మ, ఎం ఎన్ ప్రసాద్, సీవీ రావు నేతృత్వంలోని ప్రతినిధి బృందం విశాఖపట్నం ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయం పిఆర్ఓ శ్రీనివాస్ నాయక్ ని కలిసి ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు.



## బాక్సింగ్ పోటీల్లో బుల్లయ్య కాలేజీ ఇంటర్ విద్యార్థులకు బంగారు పతకాలు

### అభినందించిన కరెస్పాండెంట్ డాక్టర్ మధుకుమార్

**విశాఖపట్నం, సెప్టెంబర్ 7, జయ జయహే**

ఏపీ ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో తిరుపతిలో నిర్వహించిన అమరావతి ఛాంపియన్షిప్ 2026 బాక్సింగ్ పోటీలలో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. అండర్17 విభాగంలో ఇంటర్ సిఈసి ప్రథమ సంవత్సరం చదువుతున్న మీనాక్షి 54-57 కేజీల విభాగంలో తలపడి స్వర్ణ పతకాన్ని, ఎంపీసీ చదువుతున్న భువన్ స్వరూప్ 52-54 కేజీల విభాగంలో తలపడి స్వర్ణ పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి డాక్టర్ జి. మధు కుమార్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి ఫ్లైట్ లెఫ్టినెంట్ డాక్టర్ బి.ఆర్.ఎస్ లక్ష్మణ్ రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. బంగారు పతకం విజేతలతో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా.జి.మధుకుమార్, ప్రిన్సిపాల్ డా.బ్రహ్మానందరెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్ ఫ్లైట్ లెఫ్టినెంట్ డా.లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.



## కిరంబోలో 53 మంది పట్టాదారులకు భూ హక్కు పత్రాలు పంపిణీ

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

వనుగుమ్మ పంచాయతీ పరిధిలోని కిరాంబో గ్రామంలో 53 మంది పట్టాదారులకు సోమవారం భూమి యాజమాన్య హక్కు పత్రాలు, పట్టాదారు పాసుపుస్తకాలను మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షురాలు సిరగం భాగ్యవతి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం జరిగింది. 2022-23 మధ్యకాలంలో కిరంబో గ్రామంలో భూ రీ-సర్వే నిర్వహించి 53 మంది పట్టాదారులను గుర్తించినప్పటికీ, అనంతరం ప్రభుత్వ మార్పిడి తదితర కారణాలతో పట్టాల పంపిణీ నిలిచిపోయిందని భాగ్యవతి తెలిపారు. తాజాగా రీ-సర్వే పూర్తయిన 53 మంది పట్టాదారులకు పాసుపుస్తకాలు అందజేసినట్లు పేర్కొన్నారు. వనుగుమ్మ గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 11 గ్రామాలు ఉండగా, ఇప్పటివరకు నాలుగు గ్రామాల్లో మాత్రమే భూ రీ-సర్వే పూర్తయిందన్నారు. మిగిలిన ఏడు గ్రామాలతో పాటు రంగబయలు పంచాయతీలోనూ భూ రీ-సర్వే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మండల అధికారులను కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, మిగిలిన గ్రామాల్లోనూ త్వరగా రీ-సర్వే జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విలేజ్ రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ సభ్యులు సుక్కు, గశిరం, రఘు, కృష్ణ, శంకర్, విష్ణు , పట్టాదారులు పాల్గొన్నారు.

## గంగవరం పోర్టు కాలుష్యంపై గలమెత్తిన యువత

**విశాఖపట్నం జయజయహే**



గంగవరం పోర్టు వెదజల్లే కాలుష్యంతో పరిసర గ్రామ ప్రజలు ఏళ్ల తరబడి బాధలు పడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని గ్రామ యువజన సంఘం నాయకులు కంభాల మహేష్ అధికారులను నిలదీశారు. సోమవారం జివిఎంసి కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ కృష్ణయ్య , కలెక్టర్ అభిశిక్త్ కిషోర్ , జివిఎంసి కమీషనర్ కేతన్ గార్గ్అధ్వర్యంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించారు .ఈ సందర్భంగా గంగవరం సమస్యలను ఆయన లేవనెత్తారు .పిసిబి అధికారులు చేపట్టిన వాయు కాలుష్య సూచికలో తీవ్రత 500 పైగా ఉన్నట్లు తేలిందన్నారు . దేశంలో ఈ స్థాయిలో ఎక్కడా నమోదు కాలేదని వాపోయారు . పరిసర గ్రామాల్లో అందరూ ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నట్లు తెలిపారు . పుట్టే పిల్లలు అస్తమా , ఊపిరితిత్తుల సమస్యలతో పుడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు . ఎన్ఎండిసి కాలుష్యం పై కలెక్టర్ కు ఫిర్యాదు చేశామని రెండు రోజులు అనంతరం పనులు యధావిధిగా చేస్తున్నారని తెలిపారు . ప్రజల ప్రాణాలంటే లెక్క లేకుండా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు . సామాన్యుల పై ఫిర్యాదు వస్తే వెంటనే స్పందించే అధికారులు కంపెనీలపై ఎందుకు చర్యలు తీసుకోరని నిలదీశారు. తీవ్ర కాలుష్యంతో కొన్నేళ్ళుగా ప్రజలు బయట నిద్రించడం మానేసారని తెలిపారు . ప్రజలు పొద్దున్న లేచింది మొదలు పరిశ్రమల కాలుష్యంతో సహవాసం చేస్తున్నామని తెలిపారు. కాలుష్య తీవ్రత కారణంగా ప్రభుత్వం ఇతర ప్రాంతాలకు తరలిస్తామని హామీ ఇచ్చి నిలబెట్టుకోలేదని ఎద్దేవా చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గంగవరం సమస్యలపై ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు .అయన వెంట చోడిపిల్లి ప్రసాదు , రాజు పాల్గొన్నారు .



## ఉత్తర కోస్తా జల వనరుల శాఖ చీఫ్ ఇంజినీర్‌గా డోల తిరుమలరావు

### బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అభినందనలు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 7, జయ జయహే**

ఏపీ ప్రభుత్వ ఉత్తర కోస్తా జల వనరుల శాఖ చీఫ్ ఇంజినీర్‌గా డోల తిరుమల రావు సోమవారం విశాఖలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఉత్తర కోస్తా ప్రాంతం పరిధిలో అల్లూరి సీతారామరాజు (ఏఎస్ఆర్), అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలు ఉన్నాయి. ఉత్తర కోస్తా చీఫ్ ఇంజినీర్‌గా తన బాధ్యతలకు అదనంగా, పోలవరం ప్రాజెక్టు క్వాలిటీ కంట్రోల్ బాధ్యతలను కూడా డోల తిరుమలరావు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ బి. శ్రీహరి, సూపరింటెండింగ్ ఇంజినీర్ పి. అప్పలనాయుడు, సూపరింటెండింగ్ ఇంజినీర్ హెచ్. మన్మథరావు, సూపరింటెండింగ్ ఇంజినీర్ ఆర్. రామచంద్రరావు, డిప్యూటీ సూపరింటెండింగ్ ఇంజినీర్ సీతారాం నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి. గోవిందరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గన్నిరాజు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు లావణ్య ప్రియదర్శిని, గణేష్, రమణమూర్తి, అప్పలనాయుడు, పద్మజ తదితర ఇంజినీర్లు, అధికారులు కలిసి అభినందన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఈ డోల తిరుమలరావు మాట్లాడుతూ, అందరూ కలిసి ఒక జట్టుగా పనిచేస్తూ, అత్యంత నిజాయితీ, అంకితభావం మరియు నిబద్ధతతో సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. జల వనరుల శాఖ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడంలో టీమ్ వర్క్, సమన్వయం, అంకితభావం మరియు నిబద్ధత ఎంతో ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను చిత్తశుద్ధితో, అంకితభావంతో నిర్వర్తించాలని డోల తిరుమలరావు సూచించారు.



## శ్రీ వారాహి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

**కాకినాడ (జయ జయహే )**

పెదపూడి మండలం కరకుదురులో శ్రీ వారాహి అష్ట పీఠంలో వారాహి అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా అమ్మ వారిని దర్శించుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు ఈ కార్యక్రమంలో సింగినేడి నాగ తిరుపతరావు (దత్తుడు) సాన శ్రీనివాసు పెదపూడి మండలం కూటమి నాయకులు, కరకుదురు గ్రామ కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎత్తైన భవనాలు కాదు... సురక్షితమైన నగరాలే అభివృద్ధికి గుర్తు

(ప్రతాప్)

నగరాభివృద్ధికి ఆకాశహర్మ్యాలు, విస్తరిస్తున్న రహదారులు, వాణిజ్య సముదాయాలు, ఆధునిక గృహ నిర్మాణాలు ప్రతీకలుగా కనిపిస్తాయి. కానీ ఒక నగరం నిజంగా ఎంత అభివృద్ధి చెందిందో కొలిచే అసలైన ప్రమాణం భవనాల ఎత్తు కాదు---అక్కడ నివసించే ప్రతి వ్యక్తికి లభించే భద్రత. ఢిల్లీలోని సత్య నికేతన్‌లో ఐదు అంతస్తుల భవనం కూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటన, పట్టణాభివృద్ధిలో భవన భద్రతను అత్యంత ప్రాధాన్య అంశంగా చూడాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తుచేసింది.

భారతదేశ పట్టణీకరణ వేగంగా పెరుగుతోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభాలో పట్టణ ప్రాంతాల వాటా 31.1 శాతం. 2036 నాటికి దాదాపు 60 కోట్ల మంది భారతీయులు పట్టణ ప్రాంతాల్లో నివసించే అవకాశం ఉందని అంచనాలు చెబుతున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో నగరాల వాటా ఇప్పటికే గణనీయంగా ఉంది. ఇంతటి జనాభా, ఆర్థిక కార్యకలాపాలకు ఆధారమైన భవనాల భద్రతను కేవలం నిర్మాణ అనుమతుల అంశంగా కాకుండా ప్రజా భద్రతకు సంబంధించిన మౌలిక బాధ్యతగా చూడాలి.

భవన భద్రత నిర్మాణ సమయంలోనే ప్రారంభమై, భవనం జీవితకాలం మొత్తం కొనసాగాలి. నేల సామర్థ్యం, పునాది బలం, నిర్మాణ సామగ్రి నాణ్యత, భూకంప నిరోధక ప్రమాణాలు, అగ్నిమాపక సదుపాయాలు, విద్యుత్ భద్రత, అత్యవసర నిష్క్రమణ మార్గాలు వంటి అంశాలతో పాటు, భవనం పూర్తయిన తర్వాత కూడా నిర్దిష్ట వ్యవధిలో నిర్మాణాత్మక తనిఖీలు జరగాలి. ముఖ్యంగా పాత భవనాల్లో అదనపు అంతస్తులు, గోడల తొలగింపు, భారీ యంత్రాల ఏర్పాటు వంటి మార్పులకు ముందు నిపుణుల ధ్రువీకరణ తప్పనిసరి చేయడం అవసరం.

విద్యార్థి వసతి గృహాలు, చెల్లింపు అతిథి గృహాలు, కార్మికుల నివాసాలు వంటి అధిక జనసాంద్రత ప్రాంతాలకు ప్రత్యేక భద్రతా ప్రమాణాలు అవసరం. నగరాల్లో అందుబాటులో ఉండే చౌకైన, నాణ్యమైన వసతి కొరత కూడా ప్రజలను సరైన భద్రతా ప్రమాణాలు లేని భవనాల వైపు నెట్టకుండా చూడాలి. అందువల్ల సురక్షితమైన గృహ వసతి కూడా పట్టణ మౌలిక సదుపాయాల్లో భాగమే.

ప్రతి నగరంలో అధిక ప్రమాద భవనాల డిజిటల్ జాబితా రూపొందించడం, నిర్దిష్ట కాలవ్యవధిలో నిర్మాణ భద్రతా తనిఖీలు నిర్వహించడం, భద్రతా ధ్రువీకరణ పత్రాలను డిజిటల్‌గా నమోదు చేయడం, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన వ్యవస్థలను బలోపేతం చేయడం వంటి చర్యలు ఫలప్రదంగా ఉంటాయి. స్థానిక సంస్థలకు శిక్షణ పొందిన సిబ్బంది, ఆధునిక తనిఖీ పరికరాలు, సాంకేతిక నైపుణ్యం అందించడం కూడా అంతే కీలకం.

అభివృద్ధి అంటే ఎక్కువ భవనాలు నిర్మించడం మాత్రమే కాదు; నిర్మించిన ప్రతి భవనం ప్రజల ప్రాణాలకు భరోసా ఇవ్వడం. నగర సౌందర్యం కాంక్రీటుతో నిర్మించవచ్చు; కానీ నగర విశ్వసనీయత భద్రతతోనే నిర్మితమవుతుంది. ఎత్తైన భవనాలు నగరానికి ఆకారాన్ని ఇస్తే, సురక్షితమైన భవనాలే ఆ నగరానికి భవిష్యత్తును ఇస్తాయి. ప్రజల ప్రాణ భద్రతను పట్టణ ప్రణాళికకు తొలి ప్రమాణంగా నిలబెట్టినప్పుడే మన నగరాలు నిజమైన అర్థంలో ఆధునికమైనవి, స్థిరమైనవి, మానవీయమైనవిగా మారతాయి.

# గణాంకాల్లో తగ్గుదల.. సామాన్యుడి బడ్జెట్‌లో పెరుగుదల

(ప్రతాప్)

**ద్రవ్యోల్బణం తగ్గుతోంది. ఆర్థిక గణాంకాలు ఉపశమనం ఇస్తున్నాయి. కానీ మార్కెట్‌కు వెళ్లినప్పుడు సామాన్యుడికి ఆ ఉపశమనం ఎందుకు కనిపించడం లేదు? నెల జీతం ఖాతాలో పడిన కొద్దిరోజులకే కూరగాయలు, పాలు, పప్పులు, నూనె, విద్య, వైద్యం, రవాణా ఖర్చులు బడ్జెట్‌ను ఎందుకు కుదేలు చేస్తున్నాయి?**




ఇక్కడే ద్రవ్యోల్బణ గణాంకాలకు, సామాన్యుడి జీవన అనుభవానికి మధ్య ఉన్న అంతరం కనిపిస్తుంది.

భారతదేశంలో వినియోగదారుల ధరల ఆధారిత ద్రవ్యోల్బణం 2025--26లో గణనీయంగా తగ్గింది. ఆర్థిక సర్వే ప్రకారం 2022--23లో సగటు రిటైల్ ద్రవ్యోల్బణం 6.65 శాతం ఉండగా, 2025--26 ఏప్రిల్--డిసెంబరు కాలంలో అది సగటున 1.71 శాతానికి తగ్గింది. ఆహార ధరలు తగ్గడం ఈ పరిణామంలో ప్రధాన పాత్ర పోషించింది.

2026 జూలైలో దేశవ్యాప్తంగా సిపీఇ ఆధారిత ద్రవ్యోల్బణం 4.45 శాతంగా నమోదైంది. అయితే ఈ సంఖ్యను చూసి "ధరలు తగ్గిపోయాయి" అని భావించడం పొరపాటు. ద్రవ్యోల్బణం తగ్గడం అంటే ధరలు తగ్గడం కాదు; ధరలు పెరిగే వేగం తగ్గడం. గతంలో పెరిగిన ధరలు అలాగే కొనసాగవచ్చు.

ఇక ఆహార ధరల విషయంలో పరిస్థితి మరింత సున్నితమైనది. ఆహారం ఒక కుటుంబానికి ఐచ్ఛిక వ్యయం కాదు. ముఖ్యంగా తక్కువ ఆదాయ కుటుంబాల్లో ఆదాయంలో గణనీయమైన భాగం ఆహారానికే వెళ్తుంది. అందువల్ల బియ్యం, పప్పులు, కూరగాయలు, పాలు వంటి నిత్యావసర వస్తువుల ధరల్లో స్వల్ప మార్పు వచ్చినా కుటుంబ బడ్జెట్‌పై దాని ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ఇటీవలి కాలంలో ఆహార ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గడానికి కూరగాయలు, పప్పులు వంటి కొన్ని ప్రధాన ఆహార వస్తువుల ధరలు తగ్గడం దోహదపడింది. అయితే ఇదే మనకు మరో పాఠాన్ని నేర్పుతోంది---ఆహార ద్రవ్యోల్బణం భారతదేశంలో సరఫరా పరిస్థితులపై ఎంతగా ఆధారపడి ఉందో. మంచి పంట వస్తే ధరలు పడిపోవచ్చు; వాతావరణం దెబ్బతింటే అదే వస్తువుల ధరలు ఒక్కసారిగా ఎగబాకవచ్చు.

అందుకే ప్రతి ధరల పెరుగుదలకు తక్షణ ప్రభుత్వ జోక్యం అవసరం లేదు; కానీ ప్రతి ఆకస్మిక ధరల పెరుగుదల వెనుక కారణాన్ని వేగంగా గుర్తించే వ్యవస్థ మాత్రం అవసరం.

రైతు పొలంలో పండించిన కూరగాయ వినియోగదారుడి వంటింటికి చేరేలోపు అనేక దశలు దాటుతుంది. రవాణా, నిల్వ, మధ్యవర్తిత్వం, మార్కెట్ ఛార్జీలు, పంట నష్టం---ఇవన్నీ తుది ధరను ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా త్వరగా పాడయ్యే కూరగాయలు, పండ్లు, పాల ఉత్పత్తుల్లో శీతల నిల్వ సదుపాయాలు, గిడ్డంగులు, సమర్థవంతమైన రవాణా వ్యవస్థ అత్యవసరం.

ఇక్కడే భారతదేశం ధరల విధానం ఒక కొత్త దశలోకి వెళ్లాలి. ధర పెరిగిన తర్వాత స్పందించడం కంటే ధర పెరగకముందే సరఫరా లోపాలను గుర్తించి చర్యలు తీసుకునే వ్యవస్థ అవసరం. ఏ ప్రాంతంలో పంట దిగుబడి తగ్గింది? ఎక్కడ నిల్వలు తక్కువగా ఉన్నాయి? ఎక్కడ రవాణా అంతరాయం ఏర్పడింది? ఏ వస్తువుకు రాబోయే వారాల్లో కొరత ఏర్పడే అవకాశం ఉంది? వంటి సమాచారాన్ని ఉపయోగించి ముందస్తు చర్యలు తీసుకోవాలి.

అదే సమయంలో రైతు ప్రయోజనాన్ని మరచిపోవడం కూడా ప్రమాదకరం. వినియోగదారుడికి తక్కువ ధర ఇవ్వాలనే ఉద్దేశంతో రైతుకు తక్కువ ధర లభిస్తే, తదుపరి సీజన్‌లో ఉత్పత్తి తగ్గే ప్రమాదం ఉంటుంది. రైతుకు న్యాయమైన ధర, వినియోగదారుడికి అందుబాటు ధర---ఈ రెండింటి మధ్య సమతుల్యతే స్థిరమైన ఆహార ధర విధానానికి పునాది.

ధరల నియంత్రణలో ప్రభుత్వానికి మరో ముఖ్యమైన ఆయుధం పారదర్శకత. దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ మార్కెట్ల నుంచి ధరల సమాచారాన్ని ప్రభుత్వం సేకరిస్తోంది. ఈ సమాచార సేకరణ వ్యవస్థను మరింత వేగవంతం చేసి, స్థానిక మార్కెట్ స్థాయిలోనూ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ధర ఎందుకు పెరిగిందో ప్రజలకు స్పష్టంగా తెలియాలి.

అత్యవసర పరిస్థితుల్లో తక్కువ ఆదాయ కుటుంబాలకు లక్ష్యిత ఆహార సబ్సిడీలు, ధరల ఉపశమన చర్యలు అవసరం. కానీ సబ్సిడీ శాశ్వత పరిష్కారం కాదు. సబ్సిడీ ఆకలిని ఆపగలదు; సమర్థవంతమైన సరఫరా వ్యవస్థ మాత్రం ధరల సమస్యను మూలంలోనే పరిష్కరించగలదు.

భారతదేశం వ్యవసాయ ఉత్పత్తిలో ప్రపంచంలో అగ్రగామి దేశాల్లో ఒకటి. అయినప్పటికీ రైతు పండించిన పంటకు స్థిరమైన మార్కెట్, శాస్త్రీయ నిల్వ, సమర్థవంతమైన రవాణా, తక్కువ పంట నష్టం, వినియోగదారుడికి స్థిరమైన ధర---ఈ మొత్తం గొలుసును ఇంకా బలోపేతం చేయాల్సి ఉంది. అందుకే ద్రవ్యోల్బణాన్ని కేవలం ఆర్బీఇ వడ్డీ రేట్లతో లేదా నెలవారీ సిపీఇ గణాంకాలతో మాత్రమే చూడలేం. భారతదేశంలో ఆహార ద్రవ్యోల్బణం అనేది వ్యవసాయం, వాతావరణం, నీటి లభ్యత, నిల్వలు, రవాణా, మార్కెట్లు, వినియోగదారుల కొనుగోలు శక్తి---అన్నింటినీ కలిపి చూడాల్సిన అంశం.

ద్రవ్యోల్బణం తగ్గడం భారత ఆర్థిక వ్యవస్థకు మంచి వార్తే. కానీ ఆ వార్త సామాన్యుడి జీవితంలో నిజమైన ఆనందంగా మారాలంటే ఒక కుటుంబం తన నెల ఆదాయంతో అవసరమైన ఆహారం, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలను ఒత్తిడి లేకుండా తీర్చుకోగలగాలి.

ఆర్థిక విధానాల విజయాన్ని గణాంకాలు కొలవవచ్చు. కానీ ప్రజల ఆర్థిక భద్రతను వంటింటి బడ్జెట్ కొలుస్తుంది.

కాబట్టి లక్ష్యం కేవలం "ద్రవ్యోల్బణం తగ్గింది" అని ప్రకటించడం కాకూడదు.

"ధరలు స్థిరంగా ఉన్నాయి, రైతుకు న్యాయం జరుగుతోంది, వినియోగదారుడికి భారం తగ్గుతోంది" అనే పరిస్థితిని నిర్మించడమే నిజమైన లక్ష్యం.

గణాంకాల్లో ద్రవ్యోల్బణం తగ్గడం ఆర్థిక విజయానికి సంకేతం కావచ్చు. కానీ సామాన్యుడి సంచీలో అదే డబ్బుకు ఎక్కువ సరుకులు చేరిన రోజే ఆ విజయం ప్రజల జీవితాల్లో కనిపిస్తుంది

# అక్షరాస్యతకు 60 వసంతాలు
# 1966-2026-అక్షరాస్యతే దేశానికి ఆస్తి..!

**సెప్టెంబర్ 8వ - తేదీ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ ప్రత్యేక శీర్షిక**

**అక్షరం లేని జీవితం రెక్కలు లేని పక్షి లాంటిది...**

**"చిరిగిన చొక్కా అయినా తొడుక్కో మంచి పుస్తకం కొనుక్కో"**

**కందుకూరి వీరేశలింగం పంతులుగారు.**




జ్ఞానానికి తొలిమెట్టు అక్షరం.అక్షరం నేర్చుకోవడం అనేది జంతువు నుండి మనిషిగా మార్చే గొప్ప ప్రక్రియ. అక్షర జ్ఞానం లేకపోతే మనిషి తన హక్కులను బాధ్యతలను తెలుసుకోలేడు. అందుకని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థ అయిన యునెస్కో సెప్టెంబర్ 8వ తేదీన అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని జరుపుతోంది.

1966 సెప్టెంబర్ 8వ తేదీన మొట్టమొదటిసారిగా అక్షరాస్యతా దినోత్సవాన్ని జరపాలి అని యునెస్కో ప్రకటించింది. 1967 సెప్టెంబర్ 8వ తేదీన మొదటి అక్షరాస్యతా దినోత్సవాన్ని జరిపింది. ఈ 2026 సంవత్సరానికి అక్షరాస్యతా దినోత్సవానికి 60 సంవత్సరాలు. ఇది అతి విశేషమైన సంవత్సరం అందుకని యునెస్కో ఒక ఆలోచనను చేసింది. [illegible] అనగా ప్రజలు భూమి సంపద కోసం అక్షరాస్యత.

77 మంది నిరక్షరాస్యులుగా ఉన్నారని అందులో 25 కోట్లు మంది బడికి వెళ్లడం లేదు అని గణాంకాల ప్రకారం లెక్క చేసింది. 1947 లో భారతదేశంలో అక్షరాస్యులు 12 శాతం మంది మాత్రమే ఉండేవారు. తర్వాత తర్వాత కొన్ని సర్వ శిక్ష అభియాన్ లాంటి సంస్థలు అనేకానేక పథకాలు ప్రవేశ పెట్టడం వలన 77 శాతానికి అక్షరాస్యులు పెరిగారు.

**అక్షరాస్యత లాభాలు**

ఒక వ్యక్తి చదువుకోవడం వలన ఆ కుటుంబంతో పాటు ఒక దేశానికి కూడా అభివృద్ధి జరుగుతుంది. ఒక గృహంలో తల్లి చదువుకుంటే ఆ గృహం అంతా వెలుతురు లభిస్తుంది. నందనవనంలా మారుతుంది. అక్షరాస్యత వలన మనిషిలో ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం, మనోధైర్యం, ముందు చూపు,బెదురులేని ఆలోచన,వంటి ఉత్తమోత్తమమైన గుణాలు పెంపొందుతాయి. ఎప్పుడైతే ధైర్యం లభిస్తుందో మనిషిలో నూతన ఉత్తేజం తో కూడిన వరవడికై అడుగులు వేయడం ప్రారంభిస్తాడు. ""అక్షరాస్యత ఉండటం వలన అంటరానితనం తగ్గుతుంది."" పర్యావరణాన్ని కాపాడుగలుగుతాడు. వ్యక్తిగతాభివృద్ధి, సమాజాభివృద్ధి,దేశాభివృద్ధి జరుగుతాయి కేవలం అక్షరాస్యత వలన మాత్రమే.

ఒక స్త్రీ చదువుకోవడం వలన ఒక తరం చదువుకున్నట్లు అర్థం ఆమె స్వతంత్రమైన ఆర్జన చేయగలదు ఏది మంచి ఏది చెడు అనే ఆలోచన చేసి సత్ప్రవర్తనతో ముందుకు సాగ గలదు.

అక్షరాస్యుడైన రైతు రసాయనాలు బదులు సేంద్రీయ ఎరువులతో పంటలను పండించి అందరికీ ఆరోగ్యాన్ని అందించగలుగుతాడు. అక్షరాస్యతను నింపుకున్న పౌరుడు ప్లాస్టిక్ వాడకం తగ్గించి పర్యావరణాన్ని రక్షించేందుకు కోసం మొక్కలు నాటి చెట్లను పెంచి వృక్షాలుగా చేసి వాటి వలన అందరికీ మేలులు ఇస్తాడు.

ఆత్మవిశ్వాసం ఉపాధి ఆరోగ్యం హక్కుల పట్ల అవగాహన దేశం కోసం దేశాభివృద్ధి కోసం ఆలోచన అక్షరాస్యత వలన మాత్రమే సాధ్యమవుతుంది కనుక చదువుకో నీ జీవితాన్ని సరిదిద్దుకో...

**రచన...**

**ఏ. బాల సౌజన్యకుమారి,**

తెలుగు ఆచార్యులు,
నంది అవార్డు గ్రహీత, విద్యావేత్త,
ప్రవచనాకర్త, ఆధ్యాత్మికవేత్త.



# ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం

**విజయనగరం సెప్టెంబర్ 8: (జయ జయహే)**



శరీర కదలికలు సజావుగా ఉండేందుకు, నొప్పులు తగ్గించేందుకు, గాయాలు మరియు శస్త్రచికిత్సల అనంతరం త్వరగా సాధారణ జీవనశైలికి చేరేందుకు ఫిజియోథెరపీ కీలక పాత్ర పోషిస్తుందని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 8న ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవాన్ని నిర్వహిస్తూ, శారీరక ఆరోగ్యంలో ఫిజియోథెరపీ ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

ప్రస్తుతం మారుతున్న జీవనశైలి కారణంగా ఎక్కువసేపు కూర్చుని పనిచేయడం, సరైన భంగిమలో కూర్చోకపోవడం, వ్యాయామం లేకపోవడం వంటి కారణాలతో చిన్న వయసులోనే మెడ, భుజాలు, నడుము నొప్పులు సాధారణమవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లను ఎక్కువగా ఉపయోగించే వారిలో కండరాలు, కీళ్లపై ఒత్తిడి పెరుగుతోంది.

ఫిజియోథెరపీ కేవలం నొప్పి ఉన్నప్పుడు మాత్రమే తీసుకునే చికిత్స కాదు. కండరాల బలం పెంచడం, కీళ్ల కదలికలను మెరుగుపరచడం, శరీర సమతుల్యతను పెంచడం, గాయాలు పునరావృతం కాకుండా చూడడం వంటి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. మోకాలి, భుజం, నడుము సమస్యలు, స్పోర్ట్స్ ఇంజ్యూరీలు, స్ట్రోక్ అనంతర పునరావాసం, శస్త్రచికిత్సల తర్వాత రికవరీ వంటి సందర్భాల్లో ఫిజియోథెరపీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

తిరుమల మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు మాట్లాడుతూ, "నొప్పి తగ్గిన వెంటనే చికిత్స ఆపేయడం కంటే, సమస్యకు కారణమైన కండరాల బలహీనత లేదా కదలికల లోపాన్ని సరిచేయడం ముఖ్యం. ప్రతి వ్యక్తి సమస్యకు అనుగుణంగా ఫిజియోథెరపీ ప్రణాళిక ఉండాలి. సరైన వ్యాయామాలు, సరైన భంగిమ, క్రమం తప్పకుండా శారీరక చలనం పాటించడం ద్వారా అనేక కండరాల, కీళ్ల సమస్యలను నియంత్రించవచ్చు. ముఖ్యంగా నొప్పి నిరంతరం కొనసాగితే స్వయంగా మందులు వాడకుండా వైద్య నిపుణులను సంప్రదించాలి" అని సూచించారు.

"కదలికే ఆరోగ్యానికి బలం.. సరైన ఫిజియోథెరపీ మెరుగైన జీవనానికి మార్గం" అని డాక్టర్ తిరుమల ప్రసాద్ , జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ అండ్ డాక్టర్ .చెల్లూరి రమ్య ఫిజితేరేపిస్ట్ పేర్కొన్నారు.

# దుశ్చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

### విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

### భోగాపురంలో యువకుడిని తాళ్ళతో కట్టి ఊరేగించిన వారిపై కేసులు నమోదు

**విజయనగరం జయజయేహే**




చట్టాన్ని అతిక్రమించి దుశ్చర్యలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని విజయనగరం జిల్లాఎస్పీ ఎ.ఆర్.దామోదర్ హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన తెలిపిన వివరాల ప్రకారం భోగాపురం మండలం రామచంద్రరాజుపేట గ్రామానికి చెందిన ఎల్లా రాజేష్ బైకు డబ్బులు ఇవ్వలేదని ఐదుగురు వ్యక్తులు అవమానవీయంగా దాడి చేసినట్లు తెలిపారు . బాధితుడిని నిర్బంధించి, హింసించి, తాళ్ళతో చేతులు కట్టేసి, మెడలో త్రాడు వేసి వీధుల్లో ఊరేగించడాన్ని జిల్లా పోలీసుశాఖ తీవ్రంగా పరిగణించిందన్నారు. ఈ విషయం తెలుసుకుని భోగాపురం భోగాపురం ఇన్చార్జ్ సిఐ ఎన్.శ్రీనివాసరావుని అప్రమత్తం చేయడంతో వారు చేరుకొని నిందితులు ఐదుగురిని వెంటనే అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు .ఘటనపై ఎస్సీ మరియు ఎస్టీ సెల్ డిఎస్పీ ఎం.వీరకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసి నిందితులపై హత్యాయత్నం, అట్రాసిటీ సెక్షన్లతో కేసు నమోదు చేసి రిమాండుకు తరలిస్తున్నట్లు తెలిపారు . బాధితుడు లారీ క్లీనరుగా పని చేస్తూ, అతని స్నేహితుడు వెన్ను మహేష్ (ఎ-2) వద్ద బైకును రూ.10వేలుకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడన్నారు. బైకును ట్రయల్ వేసే క్రమంలో ఒక కారును బైకుతో ఢీ కొట్టడం జరిగిందని, సదరు వ్యక్తి కారు డామేజ్ కావడంతో, కారు రిపేరు చేసేందుకు గాను లెంక శ్రీరాం (ఎ-1) అనే వ్యక్తి బాధ్యత వహించడంతో సమస్య సద్దుమణిగిందన్నారు.

అప్పటి నుండి ఎల్లా రాజేష్ రూ.30 వేలును చెల్లించాలని లెంక శ్రీరాం (ఎ-1) డిమాండు చేయడం, ఎల్లా రాజేష్ విషయాన్ని దాటవేస్తూ, కాలయాపన చేయడం, తప్పించుకొని తిరగడం చేస్తుండేవాడన్నారు. సెప్టెంబరు 5 వ తేది సాయంత్రం ఎల్లా రాజేష్ సుందరపేట గ్రామ జంక్షను వద్ద ఉన్నట్లుగా తెలుసుకున్న వెన్ను మహేష్ (ఎ-2), బమ్మిడి వెంకట రమణ ఏ మహేష్ (ఎ-3)తో కలసి భాదితుడిని బలవంతంగా మెకానిక్ షెడ్ కు తీసుకొని వెళ్ళి, రాత్రంతా షెడ్ లోనే నిర్భందించి, కొట్టి, డబ్బులు రాబట్టేందుకు బంధువులతో మంతనాలు జరిపారన్నారు. వారు డబ్బులు చెల్లించేందుకు ఆసక్తి కనబరచకపోవడంతో సెప్టెంబరు 6న నిందితులందరూ భాదితుడి షర్టు విప్పించి, చేతులను త్రాళ్ళతో కట్టి, మెడలో త్రాడు వేసి, భోగాపురం వీధుల్లో త్రిప్పి, అమానుషంగా ప్రవర్తించారని తెలిపారు.

నిందితులు మానవత్వం మరిచి ప్రవర్తించడం, చట్టాన్ని ఉల్లంఘించి, దుశ్చర్యలకు పాల్పడడాన్ని జిల్లా పోలీసుశాఖ తీవ్రంగా పరిగణించి, తక్షణమే స్పందించి, నిందితులను క్షణాల్లో అదుపులోకి తీసుకోవడం జరిగిందని, చట్ట ప్రకారం వారిపై కఠిన చర్యలు చేపడతామని తెలిపారు.ఈ కేసులో బాధితుడికి అండగా నిలుస్తామని, పరిహారాన్ని ఇప్పించేందుకు సంబంధిత అధికారులతో కూడా మాట్లాడడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఎస్సీ మరియు ఎస్టీ సెల్ డీఎస్పీ ఎం.వీరకుమార్, విజయనగరం ఇన్చార్జ్ డిఎస్పీ ఎస్.రాఘువులు, భోగాపురం రూరల్ సిఐ ఎన్.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ ఏవీ లీలారావు, ఎస్సై రమేశ్ ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

**నిందితులకు సెప్టెంబర్ 18 వరకు రిమాండ్**

ఐదుగురు నిందితులను సెప్టెంబర్ 18 వరకు జ్యూడీషియల్ కస్టడీకి అప్పగిస్తూ విజయనగరం జూనియర్ సివిల్ జడ్జి అనుమతించారు. వారిని విజయనగరం సబ్ జైలుకు తరలించినట్లు అధికారులు తెలిపారు.



### వాల్తేర్ ఫోటోగ్రాఫిక్ సొసైటీ

# అధ్యక్షునిగా షేత్

### ఏకగ్రీవంగా కార్యవర్గం

**విశాఖపట్నం, సెప్టెంబర్ 7, జయ జయహే**

వాల్తేరు ఫోటోగ్రాఫిక్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా పి. ఎన్. షేత్, ఎం.వి. శ్రీనివాస రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు వి డెంటల్ హాస్పిటల్ ప్రాంగణంలో జరిగిన సర్వసభ్య సమావేశం లో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. 2026-2028 గాను రెండు సంవత్సరాల పాటు ఈ కార్యవర్గం అమలులో ఉండి వివిధ కార్యక్రమాలు చేపడతాయని క్లబ్ జనరల్ సెక్రెటరీ ఎం.వి. శ్రీనివాస్ రెడ్డి వివరించారు. 2000 సంవత్సరం లో స్థాపించి ఫోటోగ్రఫీ క్లబ్ 26 సంవత్సరాల నుండి ఆర్ట్ ఫోటోగ్రఫీ పై అవగాహనా సదస్సులు, వర్కుషాపులు, జాతీయ కెమెరా దినోత్సవాలు, ఆర్ట్ ఫోటోగ్రఫీపై పోటీలు, ఫోటో ప్రదర్శనలు నిర్వీరామంగా కొనసాగుతున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫోటోగ్రఫీ అకాడమీ బెస్ట్ క్లబ్ గా గుర్తించ్చిందని నూతన కార్యదర్శి, సీనియర్ ఫోటోజర్నలిస్ట్, ఎం. వి. శ్రీనివాస రెడ్డి తెలిపారు.నూతన కార్యవర్గం లో ఎన్నికైన గౌరవ అధ్యక్షులు వి. వేణుగోపాల్ రావు, ఉపాధ్యక్షులుగా కె. ఎం. కె. రమేష్, ఐ. సన్యాసి రావు, సహాయ కార్యదర్శి గా డి. వి. రమణ, ఎస్. శ్రీనివాస్ రావు, కోశాధికారి ఆర్. వి. వి. ఎన్. జగపతి రాజు, కార్యవర్గ సభ్యులు వి. వి. రామరాజు, బండి ప్రసాద్, పల్ల శ్రీనివాసు, ఎస్. రాము, గౌరవ సలహాదారులు, వి. వెంకటేశ్వరరావు, కె. సరస్వతి రావు, పి.వి.ఎస్.యూ.బి.ప్రభు, సి.హెచ్.వి.ఎస్. విజయ భాస్కర్ ఉన్నారు.

### సంస్కృత ప్రొఫెసర్

# పీవీఆర్ మూర్తికి అవార్డు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 7, జయ జయహే**

సంస్కృత ప్రొఫెసర్ డాక్టర్ పిల్లా వెంకట రమణ మూర్తి కి డాక్టర్ ఎస్. రాధా కృష్ణన్ విజనరీ మెంటర్ అవార్డు లభించింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్బంగా ఈ అవార్డుకు ఎంపిక చేశారు. భారత ప్రభుత్వం వారి ఆధ్వర్యంలో త్రేతాయుగ్ ఫౌండేషన్ మరియు నీతి అయోగ్ విభాగం వారు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ పిల్లా వెంకట రమణ మూర్తి ని నామినేట్ చేశారు. ఈ విషయాన్ని సోమవారం ఆన్లైన్ ద్వారా యోగ్యతా పత్రం అందించారు.






### ప్రిన్సిపాల్ నరసింహరాజుకు

# మార్నింగ్ కాఫీ క్లబ్ సత్కారం

**భీమవరం ;( జయ జయహే )**

రాష్ట్రంలోనే ఎంతో ప్రతిష్టకరమైన దంతులూరి నారాయణ రాజు (డిఎన్నార్) కళాశాల ప్రిన్సిపాల్ గా భూపతిరాజు నరసింహరాజు నియమితులు కావడం హర్షించదగ్గ విషయమని మార్నింగ్ కాఫీ క్లబ్ ఫౌండర్ మరియు కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్,పిఆర్ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు, అన్నారు. సోమవారం మార్నింగ్ కాఫీ క్లబ్ అధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ గా నియమితులైన నరసింహ రాజు ను సత్కరించారు. కారుమూరి సత్యనారాయణ, కంచర్ల భాస్కరరావు, జూలూరి గోపిరాజు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కళాశాల పిడిగా నరసింహరాజు ఎన్నో సేవలను అందించారని, నేడు కళాశాల ప్రిన్సిపాల్ గా నిమమితులై మరెన్నో సేవలను అందించి కళాశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కనగర్ల విజయ రామకృష్ణ, కోట్ల ప్రసాద్, బంగారు రాము మాట్లాడుతూ పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయని, కళాశాల ప్రగతికి పాటుపడాలన్నారు. సత్కార గ్రహీత నరసింహ రాజు మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఇచ్చిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానని అన్నారు. అనంతరం నరసింహరాజు ను సత్కరించారు.



# పూలే, అంబేద్కర్ చరిత్రను విద్యార్థులు నిత్యం చదవాలి: భీశెట్టి బాబ్జి

### పూలే,సావిత్రి భాయ్, అంబేద్కర్ విగ్రహాలు ఆవిష్కరణ!

**జామి (జయ జయహే)**

భారతీయుల చరిత్ర గమనాన్ని ప్రపంచ దేశాలకి చాటి చెప్పిన మహనీయులు జ్యోతిరావు, సావిత్రి బాయ్ పూలే,అంబేద్కర్ జీవిత చరిత్రలను విద్యార్థులు నిత్యం చదివి అదే తపన కృషి తో ఉన్నత స్థాయి కి చేరుకోవాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు సోమవారం జామి మండలం కుమరాం జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు పి. బాబులాల్,అధ్యక్షతన ఎస్.ఎమ్.సి. చైర్మన్ బండారు శ్రీనివాసరావు, ఇప్పాక త్రివేణి, నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే, అంబేద్కర్ విగ్రహలను అతిధులతో కలిసి ఆవిష్కరించారు ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ ప్రముఖులతో పాటుగా జిల్లా లోని స్వాతంత్ర సమరయోధులు, నిత్యం ప్రజలకు మంచి చేసే నాయకులను స్ఫూర్తి గా తీసుకొని పిల్లలు చదవాలని కోరారు, ప్రభుత్వాలు అందిస్తున్న సౌకర్యాల తో విద్యార్థులు దుసుకు పోవాలని కోరారు,దళిత ఉద్యమాల నేతలు కళ్యాణ్, బోని అప్పారావులు మాట్లాడుతూ జాతిని మొత్తం ఐక్యత గా ఉంచడానికి అంబేద్కర్, జ్యోతిరావుపూలే,అట్టడుగు వర్గాలకు విద్యను అందించడానికి జ్యోతిబాయి పూలే పడ్డ కష్టాలను విద్యార్థులకి వివిరంగా తెలియ పరిచారు దేశ వ్యాప్తంగా జెన్ జీ ప్రభావం కనిపిస్తోందని విద్యకు మించిన సంపద లేదని అంబేద్కర్ ఏ నాడో ప్రజలకు చెప్పారని అన్నారు,ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి ఉపాధ్యాయురాలు జివిఎస్ఎస్ నాగమంజరి రాసిన జలచర విన్యాసము పుస్తకాన్ని భీశెట్టి విడుదల చేశారు,



### సరియవలసలో త్రాగునీరు బోర్‌వెల్

# మరమ్మత్తు చేపట్టాలి

**డుంబ్రిగూడ: జయ జయహే.**

డుంబ్రిగూడ మండలం గుంటసీమ పంచాయతీ సరియవలస గ్రామంలో త్రాగు నీరు బోర్ వెల్ మరమ్మత్తు చేయాలనీ ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి తామర్ల సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు పాంగి సురేష్ కుమార్ డిమాండ్ చేశారు, గత నెల రోజులు నుండి త్రాగు నీరు అందక ప్రజలు ఇబంది పడుతున్నారనీ తెలిపారు. బోర్ మరమ్మత్తుకు గురై నెలరోజులు అవుతున్న అధికారులు స్పందించకుండా ఉన్నారని చెప్పారు. సరియవలస గ్రామంలో సుమారు 50కుటుంబాలు ఉన్నారని, సోలార్ ద్వారా నీరు సక్రమంగా అందడం లేదని, వెంటనే బోర్ మరమ్మత్తు చేయాలనీ తెలిపారు. లేకపోతే ఆందోళన ఉ దృతం చేస్తామని అన్నారు, ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం పంచాయతీ కార్యదర్శి కొర్రా రామ్ లాల్, అధ్యక్షులు పాంగి తిలక్, పంచాయితీ కమిటీ సభ్యులు పాంగి కార్తీక్, కొర్రా గాసీరాం, కొర్రా జాషువా, కొర్రా రామ దాస్, గ్రామ పెద్దలు, మహీళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# కేరళలో జాతీయ షూటింగ్ రంగస్థలంపై నాసిర్ అలీ సంచలనం

**విశాఖపట్నం జయ జయహే**




విశాఖపట్నం యం వి పి కాలనీ కాలనీ కు చెందిన నాసిర్ అలీ జాతీయ స్థాయిపై దృష్టి నగరానికి గర్వకారణంగా నిలిచిన ప్రతిభావంతుడుకేరళ లోని 17వ సౌత్ జోన్ రైపిల్ షూటింగ్ రేంజ్‌లో 2026 ఆగష్టు 31 నుండి ఈ నెల 9 వరకు ఘనంగా నిర్వహిస్తున్నా జాతీయ స్థాయి షూటింగ్ పోటీల్లో యువ క్రీడాకారుడు నాసిర్ అలీ అద్భుత ప్రతిభ కనబరుస్తూ రెండు కాంస్యా పతకాలతో సంచలన విజయాన్ని నమోదు చేసి రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాడు.గతంలోకుడా భారీస్థాయిలోమన ఆంధ్ర రాష్ట్రం తరుపున జాతీయ స్థాయిలో ఈవెంట్లలో చాల పతకాలు సాధించిన విషయం అందరికీ తెలిసిందే. నాసిర్ అలీ పోటీల ప్రతి దశలోనూ అద్భుతమైనపోటీలలో ప్రతి షాట్‌లోనూ అతని లక్ష్యసాధన స్పష్టంగా కనిపించగా, సమయపాలన, క్రమశిక్షణ, శారీరక-మానసిక సమతుల్యత అతన్ని విజయపథంలో నిలబెట్టాయి. షేక్ జె తాయెబ్ బజాన్(కోచ్) సూచనలను కచ్చితంగా అమలు చేయడం, నిరంతర సాధనతో తన నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడం అతని విజయానికి ముఖ్య కారణాలుగా నిలిచాయి.క్రీడా నిపుణులు మాట్లాడుతూ, "నాసిర్ అలీలో ఉన్న కచ్చితత్వం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణ అతన్ని ఉ న్నత శిఖరాలకు తీసుకెళ్లగలవు. సరైన శిక్షణ, సదుపాయాలు లభిస్తే అతను దేశానికి కీర్తి తీసుకురావడం ఖాయం" అని పేర్కొన్నారు. విశాఖపట్నం నగరానికి మరింత గౌరవాన్ని తీసుకువచ్చింది. అతని విజయపథం మరింత వెలుగొందాలని ప్రజలు, అభిమానులు హృదయపూర్వకంగా ఆకాంక్షిస్తున్నారు.




# అరకులో ప్రభుత్వ భూములు కాపాడాలి

### అక్రమ కట్టడాలు ఆపాలి ?

**డుంబ్రిగూడ: జయ జయహే.**

అరకు పంచాయతీ కేంద్రంలో ప్రభుత్వ భూములు కాపాడాలని సోమవారం ఎమ్మార్వోకి పిర్యాదు చేసిన ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి తామర్ల సూర్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు పాంగి సురేష్ కుమార్. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ అరకు పంచాయతీ కేంద్రం సర్వే నెంబర్ 54/3లో గల ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది నాయకులు కబ్జా చేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసి, గిరిజనేతరులకు అమ్మకం జరిపి 1/70చట్టాన్ని తుంగలో త్రొక్కుతున్నారనీ చెప్పారు. సుమారు 1ఎకరం 16సెంటు విస్తీర్ణం గల స్థలాన్ని కొంతమంది రాజకీయ నాయకులు, గిరిజన నేతరులు కలిసి ఆక్రమణలు చేసుకోవడం విచారకరం అన్నారు. ప్రశ్నించిన గ్రామ పెద్దలను, పీసా కమిటీలను, ప్రజా సంఘాల నాయకులను బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసిన స్థలం ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పాఠశాలలో అభివృద్ధి కు కేటాయించాలనీ కోరారు.

# టిడిపి లీడర్‌షిప్ కాంక్లేవ్‌కు ఆదిరెడ్డి శ్రీనివాస్

**మంగళగిరి:జయ జయహే:**




టిడిపి కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహిస్తున్న రెండు రోజుల లీడర్‌షిప్ ట్రైనింగ్ కాంక్లేవ్‌లో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకుల నాయకత్వ నైపుణ్యాల పెంపు, పార్టీ--ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కాంక్లేవ్‌లో మొత్తం 10 కీలక అంశాలపై శిక్షణ, మేధోమథనం, ఇంటరాక్టివ్ సెషన్లు కొనసాగు తున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నాయకులకు ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వం--పార్టీ సమన్వయం, సంక్షేమ--అభివృద్ధి కార్యక్రమాల అమలుపై దిశానిర్దేశం చేశారు.

For a pure tomorrow.. జయహో

# కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తుంది

### బొల్లవరపు జాన్ వెస్లీ

**విశాఖపట్నం (జయ జయహే)**



వైయస్సార్సీపిక్రిస్టియన్ మైనార్టీ సెల్ క్యాంప్ కార్యాలయంలో,క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గరనుంచి మతతత్వ కార్పొరేట్ విధానాలతో నియంతృత్వంగా వ్యవహరిస్తూ అన్ని వ్యవస్థలనువ్యవస్థలను నిర్వీర్యం చేయడం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేయడం చూసాశీ. ఇప్పుడు కొత్తగా వె-ుమో నెంబర్ 3407491/=ఙ.×/ూ1/2026 తేదీ 6-9-2026 ద్వారా "స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు" అనే విచిత్రమైన కొత్త రంగుల పేర్లు పెట్టి పేదవాడి కడుపు కొట్టి ఆకలితో ఆలమటించే విధంగా కొత్త నిబంధనలు తీసుకువచ్చారు. జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో ప్రజలకు అందించిన సంక్షేమాన్ని తూట్లు పొడిచే విధంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నది .ఈ మెమో అంతరార్థం ఏమిటంటే ప్రస్తుతం ఉన్న పెన్షన్లు ఎలా పీకి వేయాలి, కొత్త వాటిని ఎలా రాకుండా అడ్డుకోవాలని వేసిన ఒక పక్క ప్రణాళిక అని అర్థమవుతుంది. జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో పెన్షన్ అంటే ఒక నమ్మకం, ఒక భరోసా గా ఉండేది. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఎవరైనా సరే ఒక రూపాయి లంచం లేకుండా ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరగకుండా కేవలం అర్హత ఉంటే చాలు కులాల, మతాలకతీతంగా గ్రామ మరియు వార్డు సచివాలయం ద్వారా వాలంటీర్లు ప్రతినెల 1వ తేదీ తెల్లవారుజామునే తలుపు తట్టి మరీ చేతిలో డబ్బులు పెట్టే గొప్ప వ్యవస్థను జాన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నడపడం జరిగింది. ఈ కూటమి ప్రభుత్వం ఏం చేస్తుంది?సచివాలయాల వ్యవస్థను పక్కనపెట్టి, వాలంటీర్లు అందర్నీ తీసివేసి వారిని, నమ్ముకున్న కుటుంబాలను రోడ్డున పడేలా చేసింది. గత ప్రభుత్వంలో వాలంటీర్లు అందించిన సేవలను ప్రజలు మర్చిపోయే విధంగా చేయాలని, ఒక దురుద్దేశంతో "స్వర్ణ గ్రామం -స్వర్ణ వార్డు" కమిటీలు అంటూ కొత్త నాటకానికి తెరతీసింది. జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రాజకీయ రంగు అనే వ్యవస్థనే లేకుండా చేశారు. అర్హత ఉన్నవారికి పార్టీలతో సంబంధం లేకుండా తెలుగుదేశం పార్టీ వారితో సహా "నవరత్నాల" ద్వారా ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పింఛన్లు మంజూరు చేయడం జరిగింది. కానీ ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వం పచ్చ నేతల సిఫార్సు ఉంటేనే పెన్షన్ ఇవ్వాలి లేకపోతే లేదు అనే విధంగా పరోక్షంగా వారికి మద్దతు ఇవ్వడం జరుగుతున్నది .ఇది రాష్ట్రంలో పేదవాడి హక్కును కాలరాయడమే ఈ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఎన్నో గొప్పలు చెప్పింది సూపర్ సిక్స్ పేరుతో ఎన్నో హామీలను ఇచ్చి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసింది. అధికారంలోకి వచ్చాక పెన్షన్లకు సంబంధించి కొత్త అప్లికేషన్స్ తీసుకుంటాం అని చెప్పి రెండు సంవత్సరాల మూడు నెలలు తరబడి కాలయాపన చేసి ఇప్పుడు ఈ వె-ుమో ద్వారా వడపోత కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం కళ్లు తెరిచి ఎలాంటి కఠినమైన నిబంధన లేకుండా ఉన్న పెన్షన్లను రద్దు చేయ చేయకుండా ఉండాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున కోరుతున్నాం. జగన్ కల్పించిన పెన్షన్ల భరోసాను దెబ్బతీసి ప్రజలను ఇబ్బంది పెట్టాలని చూస్తే, ఈ రాష్ట్ర ప్రజల పక్షాన నిలబడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పెద్ద పోరాటం చేస్తుందనితెలిపారు



## జనసేన నాయకుడి నూతన గృహానికి ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ నిడదవోలు పట్టణానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నిడదవోలు పట్టణ జనసేన నాయకులు రంగారమేష్ నూతన గృహాన్ని సందర్శించారు.నూతన గృహానికి చేరుకున్న పురంధేశ్వరి, కందుల దుర్గేష్‌కు రంగారమేష్ కుటుంబ సభ్యులు ఆత్మీయంగా స్వాగతం పలికారు. అనంతరం కొద్దిసేపు కుటుంబ సభ్యులతో ముచ్చటించిన వారు వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా మాట్లాడి, నూతన గృహంలో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రంగారమేష్ కుటుంబ సభ్యులు ఎంపీ పురంధేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వారి రాకతో నూతన గృహంలో సందడి నెలకొంది. కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.




## బానిస రాజకీయాలకు స్వస్తి.. బాధ్యతాయుత పౌరులే దేశ భవిష్యత్

### ఆర్‌పిసి వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, జయ జయహే, సెప్టెంబర్ 7**

బానిస రాజకీయ పార్టీలను వీడి బాధ్యతాయుత పౌరులుగా నిలవాలని, వ్యక్తుల కంటే విలువలు, సామాజిక స్పృహ కలిగిన నాయకత్వాన్ని ప్రజలుప్రోత్సహించాలని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో జరిగిన వారాంతపు సమావేశంలో ఆయన మాట్లాడారు.రెండు తెలుగు రాష్ట్రాల్లో నిజమైన రాజకీయ మార్పు ద్వారానే అభివృద్ధి, సమృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రస్తుత కార్పొరేట్ రాజకీయ పార్టీలు ప్రజా సంక్షేమం కంటే అధికారం, ఆర్థిక ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఉచిత హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడంతో పాటు ప్రజాధనంపై భారాన్ని పెంచుతున్నారని ఆరోపించారు.సహజ వనరులు సమృద్ధిగా ఉన్నప్పటికీ దేశంలో పేదరికం, నిరుద్యోగం, సామాజిక అసమానతలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఏపీ, తెలంగాణ ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో గట్టిగా మాట్లాడే ధైర్యం చూపడం లేదని, ఢిల్లీ రాజకీయాలకు బానిసలుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.యువత స్వాతంత్ర్య సమరయోధుల స్ఫూర్తితో బాధ్యతాయుత రాజకీయ మార్పు కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను విస్మరిస్తున్న కార్పొరేట్ మీడియాకు బదులుగా సామాజిక బాధ్యతతో పనిచేసే మీడియాను ప్రజలు ప్రోత్సహించాలని సూచించారు. విలువలతో కూడిన రాజకీయాలు, బాధ్యతాయుత పాలన ద్వారానే తెలుగు రాష్ట్రాలకు బంగారు భవిష్యత్ సాధ్యమవుతుందని మేడా శ్రీనివాస్ అన్నారు.సమావేశానికి ఆర్‌పీసీ సీనియర్ సెక్యులర్ సిమ్మా దుర్గారావు అధ్యక్షత వహించారు. డి.వి. రమణమూర్తి, ఎం.డి. హుస్సేన్, దుడ్డే సురేష్, వర్ధనపు శరత్ కుమార్, దుడ్డే త్రినాథ్, కారుమూరి యుగంధర్, గుడ్ల దుర్గాప్రసాద్, బసా సోనియా, దోషి నిషాంత్, కంజేలి ఆనంద్, చల్లా సాంబశివరావు, చల్లా వంశీ తదితరులు పాల్గొన్నారు.



## వీఎంఆర్‌డీఏ ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ

**విశాఖపట్నం (జయ జయహే)**

వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో సోమవారం ప్రజాదర్బార్ జరిగింది. వీఎంఆర్‌డీఏ సమావేశమందిరంలో జరిగిన ప్రజాదర్బార్‌లో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొని అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను తెలుసుకుని, ఆయా వినతులను సంబంధిత విభాగానికి చెందిన అధికారులకు పంపించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాదర్బార్‌కు వచ్చిన వినతుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పదే పదే కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వినతులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. నిర్ణీత గడువులోగా శాఖాపరంగా చేపట్టిన చర్యలను ఆయా అర్జీదారులకు తెలియజేయాలని సూచించారు. ప్రజాదర్బార్‌కు మొత్తం మూడు వినతులు రాగా, వాటిలో ప్లానింగ్ విభాగానికి చెందినవి రెండు, పరిపాలన విభాగానికి చెందినవి ఒకటి చొప్పున ఉన్నాయి. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

**విశాఖపట్నం (జయ జయహే)**

యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి దాసరి వేణు గోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ లో చేరడం వలన విద్యార్థులలో క్రమ శిక్షణ పెరుగుతుందనీ, శారీరకంగా దృఢంగా ఉంటారని, సమాజ సేవ పట్ల అవగాహన కలుగుతుందని ఆయన తెలిపారు. పాఠశాలప్రధాన ఉపాధ్యాయుడు ఎన్. అప్పారావు మాట్లాడుతూ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ లో విద్యార్థులు చేరడం వాళ్ళ దేశ భక్తి భావం పెరుగుతుంది. స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ పొందిన వారికి పై చదువులలో మరియు ఉద్యోగాలలో అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ చైర్ పర్సన్, జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ డాక్టర్ మారుతి హరీష్ కుమార్ , జిల్లా రోవర్స్ కమిషనర్ సిహెచ్ చిత్తరంజన్ దేశాయ్, స్కౌట్స్ మాస్టర్ డి. సత్య కుమార్ శ్రీ సాయి వెంకటేశ్వర స్కూల్, కాకరలోవ స్కౌట్స్ ఽ గైడ్స్, గైడ్ కెప్టెన్ పాల్గొన్నారు.




## జాతీయస్థాయిలో సత్తా చాటిన స్కేటర్లు

**విశాఖపట్నం (జయ జయహే)**

ఈ నెల 5, 6వతేదీల్లో కేరళలో జరిగిన ఆర్టిస్టిక్ ఓపెన్ నేషనల్ ర్యాకింగ్‌చాంపియన్‌షిప్ -26 పోటీలో నగారానికి చెందిన ఇండియన్ అమెచ్యూర్ రోలార్ స్కేటింగ్ అకాడమికు చెందిన 9 మంది స్కేటర్లు మన రాష్ట్రం తరుపున ప్రాతినిథ్యం వహించారు. వివిద రాష్ట్రాలకు చెందిన స్కేటర్లతో పోటీ పడిన స్కేటర్లు ఫిగర్, ఇన్‌లైన్, డ్యాన్స్(సోలో/కపుల్స్), ఫ్రీ స్టైల్ వంటి విభాగాల్లో తమదైన ప్రతిభను కనపరిచి పతకాలను గెలుచుకున్నారు. మొత్తం 21 పతకాలు గెలుచుకోగా, వాటిలో 10 బంగారుపతకాలు, 6 రజతపతకాలు, 5 కాంశ్యపతకాలు ఉన్నాయి. చేతన్ ఆశీష్, రుషిల్ ఇద్దరూ స్కేటర్లు రెండేసి బంగారుపతకాలను చొప్పున కైవశం చేసుకున్నారు. గెలుపొందిన స్కేటర్లను ఆకాడమీ కార్యదర్శి శీలం లక్ష్మణ్, కోచ్ సింహాద్రిలతో పాటు ఇతర క్రీడాకారులు అభినందించారు.




## మెడికవర్స్ హాస్పటల్ సేవలను వినియోగించుకోవాలి

**శ్రీకాకుళం. -జయ జయహే**

శ్రీకాకుళం మెడికవర్స్ హాస్పటల్ వారి సౌజన్యంతో, ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ శ్రీకాకుళం బ్రాంచ్ వారి సమన్వయంతో ఉపాధ్యాయ దినోత్సవం స్థానిక ఎన్జిఓ హోంలో ఘనంగా నిర్వహించటం ఆనందదాయకమని, ఎపి ఎంజీవో అధ్యక్షులు హనుమంతు సాయిరాం అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ వి.కే సోమసుందర రావు అధ్యక్షులు ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారు అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై గురువులను సన్మానించటం ఆనందంగా ఉందన్నారు. మెడికవర్ ఆసుపత్రి వారు రూ.18 వందలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేయగలమని తెలియజేసినందున ఆసుపత్రి వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ ఈ అవకాశాన్ని సభ్యులందరూ సద్వినియోగపరచుకోవాలన్నారు. సోమ సుందర రావు బైపాస్ సర్జరీ జరిగినప్పటికీ కూడా సంఘం కోసం ఎంతో కష్టపడి ఈ కార్యక్రమాలు నిర్వహించడం హర్షదాయకమన్నారు. కార్యక్రమంలో డాక్టర్.దానేటి.శ్రీధర్ ప్రముఖ గైనకాలజిస్ట్, డాక్టర్ బుడుమూరు అన్నాజీ రావు ప్రముఖ కార్డియాలజిస్ట్, డాక్టర్ అనిరుద్ కుమార్, పైడి ప్రముఖ కార్డియాలజిస్ట్, డాక్టర్ సతీష్ పైడి ఎండి జనరల్, డాక్టర్ సాగరిక సెంటర్ హెడ్ లు, పాల్గొని మాట్లాడారన్నారు. గురుబ్రహ్మ గురుర్విష్ణు గురుదేవో మహేశ్వరః గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురువే నమః అన్న అంశంతో గురువే సర్వం గురువే దైవమని, గురు వద్ద నేర్చుకునే ఈ స్థాయికి రాగలిగాము తెలియజేస్తూ వారి డాక్టర్ సేవలో సాధించిన పలు విజయ గాథలు సభలో ప్రస్తావించి తెలియజేసారన్నారు. మెడి కవర్ ఆస్పత్రిలో చికిత్సలు లేటెస్ట్ టెక్నాలజీ అండ్ లేటెస్ట్ ఎక్విప్మెంట్ అనుభవజ్ఞులైన డాక్టర్స్ తో జరిపించడం జరుగుతుందని అవసరమైన వారు తప్పక హాజరై చికిత్సలు జరిపించుకోవాలన్నారు. సుమారు 60 మంది గురువులకు, మెడి కవర్ ఆసుపత్రి వైద్యులు దృశ్యాలువాలతో ఘనంగా సన్మానించారన్నారు




## విద్యార్థినుల్లో పఠన నైపుణ్యాల పెంపు, మహిళల భద్రతపై అవగాహన..

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 08,**

అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ గారి ఆదేశాల మేరకు కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం లోని గర్ల్స్ స్కూల్ లో అభ్యాస కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులతో వారి తరగతి పుస్తకాలు మరియు న్యూస్ పేపర్లను చదివిస్తూ పఠన నైపుణ్యాలు, పదజాలం, సాధారణ జ్ఞానం మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా ప్రోత్సహించారు. ప్రతిరోజూ పుస్తకాలు చదివే అలవాటును అలవర్చుకోవాలని సూచించారు. బాగా చదివిన విద్యార్థినులను అభినందించి ప్రోత్సాహకంగా బహుమతులు అందజేశారు.అనంతరం స్కూల్ విద్యార్థినులు, మహిళా పోలీసులు, స్కూల్ టీచర్లు మరియు రాజేంద్రపాలెం గ్రామస్థులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం నుండి గుడ్లపల్లి జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మహిళల భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.గుడ్లపల్లి జంక్షన్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి మహిళల భద్రత - మన బాధ్యత", "మహిళల గౌరవం - మన దేశ గౌరవం" అనే సందేశాలను వినిపించారు.ఈ సందర్భంగా బాల్యవివాహాల నిరోధక చట్టం, మహిళల భద్రతకు సంబంధించిన చట్టాలు మరియు మహిళలపై జరిగే నేరాలపై తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## పింఛన్ల నమోదు పరిశీలించిన ఎండిఓ

**మాడుగుల సెప్టెంబరు 7 జయ జయహే**

పింఛన్ దరఖాస్తులను ఆన్లైన్ లో నమోదు చేయుటకు వెబ్సైట్ పనితీరు, అప్లోడ్ చేయు విధానాన్ని మాడుగుల స్వర్ణ గ్రామము-,1లో మాడుగుల ఎం డి ఓ కే అప్పారావు సోమవారం పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈనెల ఏడు నుంచి 16వ తేదీ వరకు అర్హులైన లబ్ధిదారులందరూ పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని అయితే అందుకు కావలసిన ధ్రువపత్రాలు సమర్పించాలని ఎండిఓ సూచించారు.

# విశాఖలో తొలిసారి సమగ్ర న్యూరో ల్యాబ్

## కిమ్స్ ఐకాన్‌లో అధునాతన న్యూరో పరీక్షలన్నీ ఒకే చోట

**విశాఖపట్నం, సెప్టెంబర్ 7,(జయ జయహే)**



నరాల సంబంధిత వ్యాధుల నిర్ధారణలో కీలకమైన అధునాతన పరీక్షలను ఒకే చోట అందుబాటులోకి తీసుకువస్తూ విశాఖపట్నంలోని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్‌లో ప్రత్యేక సమగ్ర న్యూరో ల్యాబ్‌ను ప్రారంభించారు. విశాఖలో ఈ తరహాలో అన్ని ప్రధాన న్యూరో డయాగ్నస్టిక్ పరీక్షలను ఒకే వేదికపై అందించే ప్రత్యేక కేంద్రంగా ఇది అందుబాటులోకి వచ్చింది. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో లిఇండియన్ నేవీ, ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ షిప్ మాజీ మెడికల్ ఆఫీసర్ డా. వై. జవహార్ ముఖ్య అతిథిగా హాజరై న్యూరో ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నరాల సంబంధిత సమస్యలకు అవసరమైన వివిధ రకాల పరీక్షలు ఒకే చోట అందుబాటులోకి రావడం విశాఖ ప్రజలకు ఎంతో ప్రయోజనకరమన్నారు. అధునాతన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండటం వల్ల రోగులు ఇతర మెట్రో నగరాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు.



కిమ్స్ ఐకాన్ ఎండీ డా. సతీష్ కుమార్ పెతకంశెట్టి మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో న్యూరో సేవలు అందించేందుకు కిమ్స్ ఐకాన్ సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటి వరకు నరాల సంబంధిత సమస్యలకు అవసరమైన కొన్ని ప్రత్యేక పరీక్షల కోసం విశాఖ నుంచి హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఇకపై అత్యవసర సమయాల్లోనూ 24 గంటల పాటు న్యూరో డయాగ్నస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వేగంగా వ్యాధిని గుర్తించి, సరైన సమయంలో చికిత్స ప్రారంభించేందుకు ఈ సదుపాయం దోహదపడుతుందని చెప్పారు.

కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డా. సిహెచ్. విజయ్ మాట్లాడుతూ నరాలు, మెదడు, కండరాలకు సంబంధించిన వివిధ సమస్యలను గుర్తించేందుకు అవసరమైన ఎన్‌సీఎస్, వీఈపీ, బీఏఈపీ, ఎస్ఈపీ, ఈఎంజీ, వీడియో ఈఈజీ, టీసీడీ వంటి అధునాతన పరీక్షలు న్యూరో ల్యాబ్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం విశాఖపట్నంలో బ్రెయిన్ స్ట్రోక్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో వేగవంతమైన నిర్ధారణ, తక్షణ చికిత్స ఎంతో కీలకమని ఆయన అన్నారు. ముఖ్యంగా స్ట్రోక్ వంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రతి నిమిషం విలువైనదేనని, అవసరమైన న్యూరో పరీక్షలు అందుబాటులో ఉండటం ద్వారా వైద్యులు వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు వీలవుతుందని వివరించారు. మూర్ఛ, నరాల బలహీనత, చేతులు, కాళ్లలో తిమ్మిర్లు, కండరాల సమస్యలు, నడకలో మార్పులు వంటి అనేక న్యూరో సమస్యల నిర్ధారణలో ఈ ల్యాబ్ కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు.

న్యూరో ల్యాబ్‌లో వివిధ రకాల పరీక్షలు ఒకే చోట అందుబాటులో ఉండటంతో రోగులకు సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా కావడంతో పాటు వ్యాధి నిర్ధారణలో జాప్యం తగ్గుతుందని కిమ్స్ ఐకాన్ వైద్యులు తెలిపారు. ప్రత్యేకించి అత్యవసర న్యూరో కేసుల్లో 24 గంటల సేవలు అందుబాటులో ఉండటం విశాఖతో పాటు ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఐకాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. సాయి బలరామ కృష్ణ, ఆర్‌సీఈఓ డా. నగేష్, న్యూరాలజీ వైద్యులు, ఇతర వైద్య సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



## చోడవరంలో తాగునీటి సమస్య పరిష్కారం

**చోడవరం సెప్టెంబర్ 7 జయ జయహే**

చోడవరం పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామపంచాయతీ తక్షణ చర్య చేపట్టింది. మండలంలో గౌరీపట్నం నుండి వచ్చే ప్రధాన నీటి సరఫరా పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. నరసయ్యపేట సమీపంలోని టైల్స్ గోడౌన్ వద్ద పైపులైన్ దెబ్బతినడంతో, తాగునీరంతా వృథాగా పొలాల్లోకి ప్రవహించేది. ఇందువల్ల ట్యాంకుల్లోకి నీరు సక్రమంగా చేరక పోవడంతో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బంది పడేవారు. దీంతో సమస్యను తీవ్రంగా పరిగణించిన అధికారులు అప్రమత్తమై. అత్యవసరంగా విజయవాడ నుండి ప్రత్యేక జీఐ పైపును తెప్పించి సుమారు మూడు లక్షల రూపాయలతో సోమవారం పనులను ప్రారంభించారు. పాత పైపులు లేని తొలగించి కొత్త పైప్ లైన్ లో వేస్తున్నారు. ఈ సందర్భంగా ఈవో గంగాధర్ మాట్లాడుతూ కొత్త పైపులైన్ వేసే పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయనీ,ఈ పనులు వేగంగా పూర్తి చేసి, త్వరలోనే ప్రజలందరికీ పూర్తి స్థాయిలో అంతరాయం లేని తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. నీటి సమస్య పరిష్కారానికి అధికారులు తీసుకుంటున్న చెరువు పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



## హెచ్ఐవి ఎయిడ్స్‌పై అవగాహన

**చోడవరం సెప్టెంబర్ 7 జయ జయహే**

ఎక్కడైతే రిస్క్ ఉంటుందో అక్కడే హెచ్ఐవి ఉండే ప్రమాదం ఉందని, హెచ్ఐవి స్థితి తెలుసుకోవడం ముఖ్యమని చోడవరం సిహెచ్సి ఐసీటీసీ కౌన్సిలర్ ఎం శ్రీనివాస్ చెప్పారు. సోమవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హృదయ కళాశాలలో హెచ్ఐవి పై అవగాహన కల్పించారు. సురక్షితం కానీ లైంగిక సంబంధం, సురక్షితం కానీ ఎక్కించుకోవడం, తల్లిదండ్రుల నుంచి బిడ్డలకు సంక్రమించడం, నీడిల్స్ షేర్ చేసుకోవడం వంటివి ప్రమాదానికి దారి తీస్తాయన్నారు. ఈ సందర్భంగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి విద్యార్థుల నుంచి కొన్ని ప్రశ్నలకు సమాధానం రాబట్టారు. విద్యార్థులందరూ తమ మొబైల్ లో క్యూఆర్ కోడ్ ద్వారా వచ్చిన ప్రశ్నలకు సమాధానం తెలుసుకొని తమ రిస్కు తెలుసుకోవాలని అన్నారు. అలాగే నాకు క్యూఆర్ కోడ్ సూచనలను పాటించాలని చెప్పారు.



## తిరుపతిలో క్లాక్ ఓ అగ్రికల్చర్, ఎన్సోలైట్కార్యాలయం ప్రారంభం

### రైతాంగానికి ఆధునిక సాంకేతికత చేకూరాలి: డా. డాలర్స్ దివాకర్ రెడ్డి

**తిరుపతి, సెప్టెంబర్ 07, జయ జయహే**

తిరుపతి: వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆటోమేషన్, నూతన ఆవిష్కరణలు అందుబాటులోకి రావడం అభినందనీయమని తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్అఫిషియో సభ్యుడు, టీడీపీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి కరకంబాడి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన క్లాక్ ఓ అగ్రికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్, ఎన్సోలైట్ సంస్థల సంయుక్త కార్పొరేట్ కార్యాలయాన్ని సోమవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రైతాంగానికి ఆధునిక సాంకేతికత చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ రంగంలో ఆటోమేషన్, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి నూతన ఆవిష్కరణలతో ముందుకు వస్తున్న సంస్థలను అభినందించారు. యూనిఫామ్ గ్రోత్ -- రియల్ ఆటోమేషన్ -- పార్టనరింగ్ ఫర్ సక్సెస్' అనే లక్ష్యంతో పనిచేస్తున్న క్లాక్ ఓ అగ్రికల్చర్, ఎన్సోలైట్ సంస్థలు రైతులకు, వ్యవసాయ రంగానికి సాంకేతిక సహకారం అందిస్తూ మరింత అభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో.. గీత కులాలకు 20 శాతం సీట్లు కేటాయించాలి

### విశాఖ జిల్లాలో సామాజిక వర్గం నిర్లక్ష్యం పై ఆందోళన
### యాత, శ్రీ శయన కార్పొరేషన్ వెంటనే ఏర్పాటు చేయాలి
### నీరా ఉత్పత్తులకు రాష్ట్రంలో అనుమతులు ఇవ్వాలి
### గీత కులాల ఐక్య వేదిక డిమాండ్

**విశాఖపట్నం, సెప్టెంబర్ 7:(జయ జయహే)**

రాష్ట్రవ్యాప్తంగా సామాజికంగా, రాజకీయంగా బలమైన ప్రాతినిధ్యం కలిగి ఉన్న గీత కులాలైన శెట్టిబలిజ,యాత,గౌడ,ఈడిగ,శ్రీ శయన సామాజిక వర్గం విశాఖ జిల్లాలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని 'గీత కులాల ఐక్య వేదిక' ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు నగరంలో పౌరగ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గీత కులాల ఐక్య వేదిక అధ్యక్షులు సంపంగి శ్రీనివాస్, కార్యదర్శి అప్పారి గిరిబాబు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 67 లక్షల జనాభాతో అతిపెద్ద సామాజిక వర్గంగా ఉన్న గీత కులాలు, విశాఖపట్నం నగరంలోనే దాదాపు మూడు లక్షల సంఖ్యలో ఉన్నారని వారు తెలిపారు. అయితే రాజకీయ పార్టీలు తమను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకొని, ఎన్నికల అనంతరం విస్మరిస్తున్నాయని ఆరోపించారు.



## మట్టి మాఫియాను అరికట్టాలి

### ఇండియా కూటమి మిత్రపక్షాల డిమాండ్

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 07, జయ జయహే**

శ్రీకాళహస్తి: మట్టి మాఫియాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి మిత్రపక్షాల నాయకులు సోమవారం శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు. తొట్టంబేడు మండలం గుండేలిగుంట గ్రామానికి చెందిన చంద్రశేఖర్ మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన ఘటన నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ.. మట్టి మాఫియా కారణంగా గత కొంతకాలంగా రెండు మరణాలు సంభవించాయని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకుని, మట్టి మాఫియాను పూర్తిస్థాయిలో అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన మట్టి అక్రమ రవాణాను నియంత్రించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే, రానున్న రోజుల్లో తీవ్రస్థాయిలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కరీముల్లా, సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి గండం మణి, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎస్. జాకీర్, సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి పుల్లయ్య, శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, సీఐటీయూ నాయకులు గురవయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు బాల, ఏఐటీయూసీ నాయకులు శివకుమార్, చందు, అజిత్, నాగరాజు, జోసెఫ్, చరణ్, రఫీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## అక్షరశ్రీ కుమార్ రాజుకు సత్కారం

**చోడవరం సెప్టెంబర్ 7 జయ జయహే**

విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి కుమార్ రాజు తెలుగు భాష, సాహిత్యమునకు చేసిన విశేష కృషికి ఇటీవల విశ్వసాహితీ కళావేదిక వారు అక్షర శ్రీ బిరుదుతో సత్కరించారు. ఈ నేపథ్యంలో సోమవారం చోడవరం గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయన్ని గ్రంథాలయంలో స్థానిక గ్రంథాలయ ఉద్యోగులు సత్కరించి అభినందనలు తెలిపారు. అంతకుముందు ఆయన గ్రంథాలయంలో రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఇన్చార్జి లైబ్రేరియన్ ఎమ్మెస్ ఎల్ జోగేశ్వరి, మాడుగుల శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ వై వెంకటేశ్వర్లు, వడ్డాది శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ వి కృష్ణ, కేజే పురం లైబ్రరీ ఇన్చార్జి శృతి, గ్రంథాలయ పాఠకులు సిబ్బంది పాల్గొన్నారు.




## వాసవి గురువులను సత్కారం

**చోడవరం సెప్టెంబరు 7 జయ జయహే**

వాసవి క్లబ్ వ్యవస్థాపకుడు కేసి గుప్తా జయంతి సందర్భంగా ఈ నెల ఒకటో తేదీ నుంచి నిర్వహిస్తున్న వాసవి వారోత్సవాలు సోమవారం వాసవి గురుడు సత్కారంతో ముగిశాయి. ఈ సందర్భంగా వాసవి యూత్ క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ సత్యవరపు శ్రీనివాసరావు ని జిల్లా గవర్నర్ పూసర్ల రమణమూర్తి ని, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం చైర్మన్ కలగర్ల శేషగిరి రావు ని, వాసవి క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ పసుమర్తి హరిబాబు తో పాటు వాసవి యూత్ క్లబ్, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ లకు చెందిన చోడవరం వాసవి గురువులను సత్కరించారు. ఈ కార్యక్రమానికి రీజియన్ 2 అర్ సి పెన్నం రాజా, ఆర్ఎస్ నాలం మూర్తి. ఫాస్ట్ ప్రెసిడెంట్ మూడు క్లబ్బుల పిఎస్టీలు పాల్గొన్నారు.

## హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

### వంశపారంపర్య ఆస్తికి రక్షణ కల్పించాలి

**తొట్టంబేడు, సెప్టెంబర్ 7 (జయ జయహే )**



తొట్టంబేడు హైకోర్టు ఉత్తర్వుల మేరకు వంశపారంపర్యంగా సంక్రమించిన తమ ఆస్తికి రక్షణ కల్పించాలని కోరుతూ తొట్టంబేడు గ్రామానికి చెందిన బాధితులు సోమవారం తొట్టంబేడు సీఐ లక్ష్మీనారాయణ కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చెందిన గంగయ్య భార్య కృష్ణవేణమ్మకు సంబంధించిన పలు సర్వే నంబర్లలోని భూమిపై హైకోర్టులో విచారణ జరగగా, ఆమెకు అనుకూలంగా ఉత్తర్వులు వెలువడ్డాయని బాధితులు తెలిపారు. అయితే ఇటీవల కొందరు వ్యక్తులు తమ భూముల్లోకి ప్రవేశించి బోర్డులు ఏర్పాటు చేస్తున్నారని సీఐ దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ భూముల్లో జోక్యం చేసుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తమ ఆస్తులకు రక్షణ కల్పించాలని వారు కోరారు. ఈ సందర్భంగా సంబంధిత హైకోర్టు ఉత్తర్వుల ప్రతులను సీఐకి అందజేశారు.



## మత్తు పదార్థాలు, సైబర్ నేరాలపై విద్యార్థుల ర్యాలీ

### మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి: డీఎస్పీ

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 7, జయ జయహే**

శ్రీకాళహస్తి మత్తు పదార్థాల వినియోగం, మహిళలపై నేరాలు, సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు శ్రీకాళహస్తి పట్టణంలో సోమవారం విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ కె. నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.వంశీ, విక్రమ్, రాయలసీమ జూనియర్ కళాశాలలకు చెందిన సుమారు 400 మంది విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. నారద పుష్కరిణి నుంచి నాలుగు మాడా వీధుల మీదుగా పెండ్లి మండపం వరకు ప్లకార్డులు, బ్యానర్లతో ర్యాలీ నిర్వహించారు.అనంతరం డీఎస్పీ నరసింహమూర్తి మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళలు, బాలికలపై వేధింపులు, లైంగిక దాడులను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లు, లింకులను నమ్మవద్దని సూచించారు. ఓటిపి, బ్యాంకు వివరాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930, మత్తు పదార్థాలపై 1972, అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐ సి. వెంకటేష్, టు టౌన్ సీఐ నాగరాజు, రూరల్ సీఐ ఎస్.కె. ఇబ్రహీం, ఎస్ఐ ఎం. రామకృష్ణతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## పీజీఆర్ఎస్‌కు 275 అర్జీలు

### నాణ్యమైన పరిష్కారం చూపాలి: కలెక్టర్

**తిరుపతి, సెప్టెంబర్ 7, జయ జయహే**

తిరుపతి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను కలెక్టర్ స్వయంగా విని అర్జీలను స్వీకరించారు.అర్జీదారుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని, పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ లేకుండా సంతృప్తికరంగా పరిష్కరించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, డీఆర్వో జి. నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శివశంకర్ నాయక్, భరత్ నాయక్, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు. పీజీఆర్ఎస్‌కు రెవెన్యూ శాఖకు అత్యధికంగా 152తో కలిపి మొత్తం 275 అర్జీలు అందాయి.

# ప్రెగ్నెన్సీ ప్లాన్ చేస్తున్నారా?

## అయితే ఈ టిప్స్ ఫాలో అవ్వండి...



**కొంతమంది ఆడవారు త్వరగా పిల్లల్ని కనాలనుకుంటారు. అలాంటివారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అవేంటో తెలుసుకోండి. పిల్లలను ప్లాన్ చేసుకునే దంపతులు.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?**

పెళ్ళైన జంటలు.. త్వరగా పిల్లల్ని కనాలనుకుంటారు. అలాంటి వారు వారి లైఫ్‌స్టైల్‌లో కొన్ని హెల్దీ హ్యాబిట్స్‌ని ఫాలో అవ్వాలి. దీని వల్ల వారు త్వరగా పిల్లల్ని కంటారు. మరి ఆ హెల్దీ హ్యాబిట్స్ ఏంటి? ఏయే టిప్స్ ఫాలో అయితే త్వరగా సంతానం కలుగుతుందో పూర్తి వివరాలు తెలుసుకోండి.



**డాక్టర్‌ని కన్సల్ట్ అవ్వడం..**

గర్భం దాల్చడానికి ముందు దంపతులిద్దరూ ముందుగా హెల్త్ చెకప్ చేయించుకోవాలి. దీంతో మిమ్మల్ని పరీక్షించిన డాక్టర్స్ ఏమైనా సమస్యలుంటే వాటికి తగిన ట్రీట్‌మెంట్‌ని సజెస్ట్ చేస్తారు. లేదంటే.. పిల్లలు కనడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచిస్తారు. అవేంటో తెలుసుకోండి.

**వర్కౌట్..**

రెగ్యులర్ వర్కౌట్ అనేది గుండె, ఊపిరితిత్తులు, ఇమ్యూనిటీని బలంగా చేస్తుంది. అధిక బరువు, ఊబకాయం ఉన్నవారు రెగ్యులర్‌గా వర్కౌట్ చేయాలి. అధిక బరువు ఉన్నవారికి గర్భధారణ ఆలస్యమవుతుంది. కొన్ని సమస్యలు ఎదురవుతాయి. కాబట్టి, హెల్దీ వెయిట్ మెంటెయిన్ చేయాలి. రోజుకి 30 నిమిషాల నుండి 60 నిమిషాల వర్కౌట్ చేయాలి. వారానికి 150 నుండి 300 నిమిషాల వర్కౌట్ చేయడం వల్ల కండరాలు బలంగా మారతాయి. ఏరోబిక్స్, వాకింగ్, రన్నింగ్ వంటివి చేయొచ్చు. ఒత్తిడిని దూరం చేసే డీప్ బ్రీథ్, మెడిటేషన్, యోగా కూడా చేయొచ్చు.

**మంచి ఆహారం..**

అదే విధంగా.. సరైన పోషకాలతో నిండిన ఆహారాన్ని తీసుకోవాలి. కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, ప్రోటీన్స్ ఉన్న పాల, ఇతర ఫుడ్స్ తీసుకోవాలి. హెల్దీ లిక్విడ్స్ తీసుకోవాలి. దీని వల్ల బరువు మెంటెయిన్ చేయొచ్చు. సంతానోత్పత్తి పెరుగుతుంది.

**వీటికి దూరంగా..**

హెల్దీ ఫుడ్స్ తీసుకోవడమే కాదు.. కొన్నింటి తినడాన్ని తగ్గించాలి. స్వీట్స్, జంక్, ప్రాసెస్డ్ ఫుడ్స్‌కి దూరంగా ఉండాలి. కెఫిన్ డ్రింక్స్ సంతానోత్పత్తిని ఎఫెక్ట్ చేస్తాయి. కాబట్టి, రోజుకి తక్కువ పరిమాణంలోనే కాఫీ తాగాలి.

**మద్యపానం, ధూమపానం..**

అదే విధంగా, మద్యపానం, ధూమపానం కూడా ఆడవారిలో అండాశయ నిల్వల్ని తగ్గిస్తాయి. మగవారిలో స్పెర్మ్ కౌంట్‌ని తగ్గిస్తుంది. కాబట్టి. ఈ రెండింటిని దూరం పెట్టాలి. దీని వల్ల మీ హెల్త్‌తో, సంతానోత్పత్తి సమస్యలు దూరమవుతాయి.

**నిద్రలేమి..**

నిద్రలేమి కారణంగా చాలా ఆరోగ్య సమస్యలు వస్తాయి. దీని వల్ల బరువు పెరుగుతారు. ఇది అండోత్సర్గం సమస్యలకి కారణమవుతుంది. దీంతో పాటు మగవారిలో స్పెర్మ్ ఆరోగ్యాన్ని ఎఫెక్ట్ చేస్తుంది. కాబట్టి, ప్రెగ్నెంట్ అవ్వాలంటే తగినంతగా నిద్రపోవాలి. మంచి నిద్ర ఒత్తిడిని కూడా దూరం చేస్తుంది.

# క్షణాల్లో తలనొప్పి తగ్గాలంటే..

**తలనొప్పిగా ఉంది అనే మాట మనం చాలా కామన్‌గా వింటాం. ఈ సమస్య రాగానే కొంతమంది తగ్గాలని ట్యాబ్లెట్స్ వేసుకుంటారు. అయితే, అలా కాకుండా తలనొప్పిని సహజంగానే తగ్గించేందుకు కొన్ని టిప్స్ ఉన్నాయి. అవేంటో తెలుసుకుని తలనొప్పిని దూరం చేసుకోండి.**

**కారణాలు..**

నిజానికీ తలనొప్పి రావడానికి చాలా కారణాలు ఉంటాయి. ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి, సరిలేని ఆహారం, ఎక్కువగా ఆల్కహాల్ తీసుకోవడం, కళ్ళు అదే పనిగా చూడడం, హైబీపీ, మైగ్రేన్స్, సైనస్, జలుబు, ధూమపానం, కాలుష్యం.. ఇవన్నీ కూడా తలనొప్పికి కారణాలే. అయితే, ఈ తలనొప్పిని తగ్గించేందుకు కొన్ని సహజ మార్గాలున్నాయి. అవేంటో తెలుసుకోండి.

**తలనొప్పిని తగ్గించే టిప్స్..**

**నీరు తాగడం..**

డీహైడ్రేషన్ వల్ల కూడా తలనొప్పిగా ఉంటుంది. కాబట్టి, ఆ సమస్యని తగ్గించేందుకు నీటిని తాగండి. వీటితతో పాటు హెర్బల్ డ్రింక్స్ తాగొచ్చు. అల్లం టీ, లెమన్ టీల వంటివి రక్తనాళాల వాపుని తగ్గించడంలో హెల్ప్ చేస్తాయి. వికారాన్ని తగ్గిస్తాయి.

**నమలొద్దు..**

కొంతమంది చూయింగ్ గమ్‌ని అదేపనిగా నములుతుంటారు. దీని వల్ల దవడ ప్రాంతం, బుగ్గల లోపలం భాగంలో నొప్పి ఉంటుంది. దీంతో తలనొప్పి తగ్గుతుంది. మెత్తని ఆహారాలు తినడం వల్ల తలనొప్పి తగ్గుతుంది.

**మసాజ్..**

మనం జుట్టుని టైట్‌గా జడవేసిన తలనొప్పి వస్తుంది. కాబట్టి, జడని లూజ్‌గా వేసుకుని తలపై మెల్లిగా మసాజ్ చేయండి. దీని వల్ల చాలా వరకూ రిలాక్స్ అవుతారు. తలనొప్పి తగ్గుతుంది. నుదురు, మెడపై మెల్లిగా మసాజ్ చేస్తే ఒత్తిడితో వచ్చే టెన్షన్ తలనొప్పి తగ్గుతుంది. ఎసెన్షియల్ ఆయిల్‌తో కనుబొమ్మలు, నుదుటిపై మసాజ్ చేస్తే రక్త ప్రసరణ పెరుగుతుంది. పుదీనా, తులసి, లావెండర్ నూనెలు కూడా వీటికి హెల్ప్ చేస్తాయి.

**రెస్ట్ తీసుకోవడం..**

తలనొప్పిగా ఉన్నప్పుడు కాసేపు ఈ పని చేయకుండా రెస్ట్ తీసుకోండి. వీలైతే ఓ చీకటి గదిలో 1, 2 గంటలు పడుకోవడం, మొబైల్స్, గ్యాడ్జెట్స్ వాడకాన్ని తగ్గించడం, రెస్ట్ తీసుకోవడం వల్ల తలనొప్పి తగ్గుతుంది.

**కోల్డ్ ప్యాక్..**

కొన్ని సార్లు అధిక వేడి కారణంగా కూడా తలనొప్పి పెరుగుతుంది. కాబట్టి, నుదుటిపై కోల్డ్ ప్యాక్‌ని అప్లై చేయండి. ఐస్ ప్యాక్స్‌ని మెత్తని గుడ్డలో పెట్టి నుదుటిపై అప్లై చేయండి. 15 నిమిషాల వరకూ ఇలానే చేస్తే తలనొప్పి తగ్గుతుంది. దీని వల్ల తలతిరగడం, మాట్లాడడంలో ఇబ్బంది, వంటి లక్షణాలు కూడా తగ్గుతాయి.



Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com